వైభవంగా గజేంద్ర మోక్షోత్సవం

- వేలాదిగా పాల్గొన్న భక్తజనం
- సింహాచలంలో కన్నుల పండువగా వేడుక

- 6లో



కొలను వద్ద ఏర్పాటు చేసిన దారు ప్రతిమలు



జన సంచారం లేని ఫ్లైఓవర్, రామా టాకీస్ రోడ్డు

బోసిపోయిన నగరం

సంక్రాంతికి స్వస్థలాలకు వెళ్లినవారు ఇంకా తిరిగిరాకపోవడంతో నిర్మానుష్యంగా రహదారులు

ఈసారి కనుమనాడు భారీగా మాంసం అమ్మకాలు

- 50 టన్నుల మటన్, రెండు లక్షల కోళ్లు...
- మద్యం అమ్మకాలు రూ.20 కోట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరం ఇంకా బోసిపోతూనే ఉంది. సంక్రాంతి ముఖ్యమైన పండుగ కావడంతో అత్యధికులు కుటుంబాలతో సహా ఊళ్లకు వెళ్లిపోయారు. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉండే విశాఖపట్నంలో రహదారులన్నీ బుధవారం బోసిపోయి కనిపించాయి. కనుమ పండుగ జరుపుకుని సమీప ప్రాంతాల్లో ఉన్నవారు రాత్రి నగరానికి చేరుకున్నారు. ఇంకా అత్యధికులు గ్రామాల్లోనే ఉన్నారు. వారంతా గురువారం బయలుదేరి వచ్చే అవకాశం ఉంది.

ఈసారి సంక్రాంతి పండుగ మాంసం విక్రేతలకు కలిసి వచ్చింది. వ్యాపారం భారీగా జరిగింది. నగర వాసులు బుధవారం ఉదయం ఆరు గంటల నుంచే మటన్, చికెన్ దుకాణాల ముందు క్యూ కట్టారు.

నగరంలో సాధారణంగా ఆదివారాల్లో మూడువేల మేకలు/గొర్రెలు కబేళాలో కోస్తారు. ఒక్కో మేక/గొర్రె నుంచి నగటున పది కిలోల మాంసం లభిస్తుంది. అంటే ప్రతి ఆదివారం 30 టన్నుల మాంసం విక్రయిస్తారు. ఈసారి కనుమ రోజున (బుధవారం) ఆదివారం కంటే రెట్టింపు విక్రయాలు చేశామని, వ్యాపారం బాగా జరిగిందని మటన్ దుకాణాల నిర్వాహకులు

... మిగతా 6వ పేజీలో



మద్దిలపాలెం చైతన్యనగర్‌లో మాంసం దుకాణం వద్ద రద్దీ

అక్రమాలకు మహా ఊతం

కోణార్క్ లాడ్జి వెనుక స్థలంలో భవన నిర్మాణానికి రెండేళ్ల క్రితం జీవీఎంసీకి దరఖాస్తు

- ఆ స్థలం అప్రూవ్డ్ లేఅవుట్‌లో రిజర్వు స్పేస్‌గా ఉందంటూ షార్ట్ ఫాల్‌లో రాసిన వార్డు ప్లానింగ్ సెక్రటరీ
- హైకోర్టులో రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు స్పష్టంగా నమోదు
- ఆస్తి పన్ను రశీదు కూడా ఆ స్థలానిది కాదంటూ రిమార్కు
- సిటీ ప్లానర్ లాగిన్‌కు వెళ్లేసరికి రిమార్కులన్నీ మాయం
- కేవలం అంతస్థుల సంఖ్య, ఎలివేషన్ చూపలేదని మాత్రమే నోట్
- ఆయా అభ్యంతరాలను దరఖాస్తుదారుడు సులభంగా సరిదిద్దుకునేందుకు అవకాశం
- ఒక్కో అధికారి, ఒక్కోలా షార్ట్ ఫాల్ రాయడంపై అనుమానాలు
- ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎవరైనా భవన నిర్మాణం అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే మొదట పరిశీలించే కిందిస్థాయి అధికారి రాసిన రిమార్కులనే పైస్థాయి అధికారులు తమ రిమార్కులుగా రాస్తారు. ఇంకా చెప్పాలంటే...కింది స్థాయి అధికారులు గుర్తించలేని లోపాలు, అభ్యంతరాలను కూడా తమ రిమార్కులుగా షార్ట్ ఫాల్‌లో చూపించాలి. కానీ డైమండ్ పార్కు సమీపంలో కోణార్క్ లాడ్జి వెనుక ఉన్న ఒక స్థలం విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ బాధ్యతను విస్మరించడం చర్చనీయాంశంగా మారింది. కిందిస్థాయి అధికారి షార్ట్ ఫాల్‌లో రాసిన రిమార్కులను తొక్కిపెట్టి, మొక్కుబడిగా సులభంగా పరిష్కరించుకునే రిమార్కులను మాత్రమే షార్ట్ ఫాల్‌లో చూపించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డైమండ్ పార్కు సమీపంలో అల్లిపురం సర్వే నంబర్ 653, 654లో 1950లో వేసిన ఒక అప్రూవుడ్ లేఅవుట్ ఉంది. అందులో కొన్ని రిజర్వు స్పేస్‌లుగా లేఅవుట్‌లో మార్కింగ్ చేశారు. అందులో



భవన నిర్మాణానికి అనుమతి కోరిన కోణార్క్ లాడ్జి వెనుక స్థలం

ప్లాట్ నంబర్ 5-బి పార్ట్-3లో భవన నిర్మాణం కోసం స్థల యజమానిగా చెప్పుకుంటున్న ఒకరు 2023 సెప్టెంబరు 2న జీవీఎంసీకి ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ మల్లగుల్లాలు పడిన తర్వాత గత ఏడాది నవంబరు 12న ఆ ప్రాంత పరిధిలోని వార్డు ప్లానింగ్ సెక్రటరీ దరఖాస్తును, దాంతోపాటు జత చేసిన పత్రాలను, భవన నిర్మాణం జరిగే స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ స్థలానికి తాము ఆస్తి పన్ను కడుతున్నట్టు పేర్కొంటూ జత చేసిన రశీదు ఆ స్థలానికి చెందినది కాదని, ఆ స్థలానికి సంబంధించి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ నుంచి అప్‌డేట్‌గా తీసుకున్న ఈసీని సమర్పించలేదని, భవన నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలం అప్రూవ్డ్ లేఅవుట్‌లో రిజర్వు స్పేస్ కింద మార్కింగ్ చేసి ఉందని, ఆ స్థలంపై హైకోర్టులో రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని షార్ట్ ఫాల్‌లో నమోదు చేశారు. వాటన్నింటినీ పరిష్కరించే పత్రాలను జత చేసి దరఖాస్తును రీ సబ్మిట్ చేయాలని పొందుపరుస్తూ తన పైఅధికారి అయిన టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ)కి పార్వాడ్ చేశారు. అదే నెల 21న టీపీఓ కొన్ని రిమార్కులు రాసి

... మిగతా 6వ పేజీలో



స్కూల్ కాంప్లెక్స్‌లు పునర్వ్యవస్థీకరణ

- జిల్లాలో 54 స్కూల్ కాంప్లెక్స్‌లు
- ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో 800-1,000 విద్యార్థులు, 40-50 ఉపాధ్యాయులు ఉండేలా కసరత్తు
- కాంప్లెక్స్ కేంద్రమైన ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు పర్యవేక్షణ బాధ్యతలు
- బోధనేతర సిబ్బంది లేనిచోట్ల ఇబ్బందులు



విశాఖపట్నం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):

పాఠశాల విద్యా శాఖ పరిధిలో గల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల పనితీరును మెరుగుపరిచేందుకు స్కూల్ కాంప్లెక్స్‌లను పునర్వ్యవస్థీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై పాఠశాలలు, ఉపాధ్యాయులపై అజమాయిషీ బాధ్యతను సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అప్పగించనున్నది. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది.

విశాఖ జిల్లాలో ఇప్పటివరకూ గల 51 స్కూల్ కాంప్లెక్స్‌లకు అదనంగా మరో మూడు మంజూరుచేసింది. దీంతో కాంప్లెక్స్‌ల సంఖ్య 54కు చేరింది. వీటిలో కేటగిరీ-ఎ కింద 51, కేటగిరీ-బి కింద మూడింటిని గుర్తించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా విద్యా శాఖ అధికారులు స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియపై కసరత్తు చేస్తున్నారు. తాజా ఉత్తర్వుల మేరకు గ్రామీణ ప్రాంతంలో 10 నుంచి 15, నగర పరిధిలో ఎనిమిది నుంచి పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఒక స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోకి తీసుకువస్తారు. స్కూల్ కాంప్లెక్స్‌గా గుర్తించే ఉన్నత పాఠశాల మధ్యలో అంటే దాని పరిధిలో ఉన్న పాఠశాలలకు అందుబాటులో ఉండాలి. ఒక స్కూల్ కాంప్లెక్స్

... మిగతా 6వ పేజీలో

పేదల ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత

- రోజుకు 500 టన్నులు అవసరం
- 200 నుంచి 250 టన్నులు రాక
- శ్రీకాకుళం జిల్లాలో ఒక రీచ్ నిలిపివేత
- రవాణా చార్జీల సవరణతో మారుమూలనున్న లేఅవుట్‌లకు ఇసుక సరఫరా చేసేందుకు ముందుకురాని లారీ యజమానులు



విశాఖపట్నం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):

పేదల కోసం చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత ఏర్పడింది. వర్షాలు తగ్గడంతో నిర్మాణాలు జోరందుకున్నాయి. ప్రస్తుతం లేఅవుట్‌లలో కూలీలకు సరిపడా పనులు చేయడానికి రోజుకు సగటున 500 టన్నుల ఇసుక అవసరం కాగా 200 నుంచి 250 టన్నులు మాత్రమే సరఫరా అవుతోంది. శ్రీకాకుళం జిల్లాలో కేటాయించిన రెండు రీచ్‌లలో ఒకటి తాజాగా మూతపడడం, రవాణా చార్జీలు తగ్గించారని ఇసుక రవాణాకు లారీ యజమానులు ఆసక్తి చూపకపోవడం ఇందుకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

నగర శివారు మండలాల్లో 65కుపైగా లేఅవుట్‌లలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు వేగం పుంజుకునేందుకు ఇసుక కొరత అడ్డంకిగా మారింది. రోజుకు కనీసం 500 టన్నులు అవసరమవుతుందని అధికారులు అంచనా వేయగా 200 నుంచి 250 టన్నులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. అన్ని లేఅవుట్‌లలో పనులు ఊపందుకుంటే ఇసుక డిమాండ్ మరింత పెరుగుతుందని చెబుతున్నారు. రెండు నెలల క్రితం ఉన్న ఇబ్బందులు తొలగి సుమారు నెల రోజులపాటు రోజుకు రమారమి 450 టన్నులు వరకూ సరఫరా అయ్యింది. అయితే శ్రీకాకుళం జిల్లాలోని రెండు రీచ్‌లలో ఒకటి తాజాగా మూతపడింది. గడచిన వారం రెండు వారాల నుంచి ఒక రీచ్ నుంచే ఇసుక ఇస్తున్నారు. దీంతో శ్రీకాకుళం నుంచి రోజూ వచ్చే లారీల సంఖ్య తగ్గిపోయింది. గతంలో మాదిరిగా రెండో రీచ్ కేటాయించాలని కోరినప్పటికీ ఇంతవరకూ శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం నుంచి అనుమతి రాలేదు. ఇదిలావుండగా రాజమండ్రి వద్ద గోదావరి నది నుంచి ఇసుక సరఫరాకు రీచ్ కేటాయించినా అక్కడ లిఫ్టింగ్‌లో ఇబ్బంది వచ్చింది. బయట నిర్మాణాల కోసం బిల్డర్లు పోటీ పడి పైరవీలు చేసుకోవడంతో విశాఖ జిల్లా అవసరాలకు సరిపడా ఇసుక ఇవ్వడం లేదు.

ఇదిలావుండగా ఇసుక రవాణా కోసం కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్ణయించిన రేటును తాజాగా సవరించింది. శ్రీకాకుళం నుంచి విశాఖ జిల్లాలో లేఅవుట్‌కు ఇసుక సరఫరా చేసినందుకు టన్నుకు రూ.850 వరకు కిరాయి ఇచ్చేవారు. అయితే నగరంలో మూడుచోట్ల ప్రైవేటు ఇసుక యార్డులకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం...అక్కడకు సరఫరా నిమిత్తం ఫ్లాట్ రేటు ఖరారు చేయడంతో లారీ యజమానులకు టన్నుకు రూ.650 వరకు మాత్రమే దక్కుతుంది. దీనికితోడు

... మిగతా 6వ పేజీలో

బ్లూ ఫ్లాగ్ బీచ్ నిర్వహణ అస్తవ్యస్తం

సిబ్బందికి మూడు నెలలుగా అందని జీతాలు

- పట్టించుకోని ఉన్నతాధికారులు
- పర్యాటక శాఖ అధికారుల పనితీరుపై పెదవివిరుపు

విశాఖపట్నం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):

పర్యాటక శాఖ అధికారుల తీరుతో రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్ నిర్వహణ నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఈ బీచ్‌కు పర్యాటకుల ఆదరణ ఎక్కువ. శని, ఆదివారాల్లోనే కాకుండా సాధారణ రోజుల్లో సైతం పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తారు. ఇది సీజన్ కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. వచ్చిన వారి నుంచి రకరకాల ఫీజుల పేరుతో బాగా దండుకుంటున్నారు. కారు పార్కింగ్ ఫీజు కింద రూ.50 తీసుకుంటున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు...ఇలా ప్రతి దానికి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారు. అందులో కొంత దుర్వినియోగం అవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందినందున బీచ్ పరిసరాలతో పాటు అక్కడ సముద్రపు నీటిని కూడా పరిశుభ్రంగా ఉంచాలి. ఆ బాధ్యతను టెండర్ల ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఒడిశాకు చెందిన ఓ సంస్థ ఈ వ్యవహారాలు చూసేది. ఇంతకు ముందు రీజనల్ డైరెక్టర్‌గా పనిచేసిన అధికారి ఒకరు పర్సంటేజీ తీసుకొని ఒడిశా వారికి కాంట్రాక్టు ఇప్పించారంటూ ఆరోపణలు గుప్పించి ఆ సంస్థను పక్కకు తప్పించారు. ఆ తరువాత కూడా రీజనల్ ఆఫీసర్‌పై దుష్ప్రచారం చేయడంతో ఆయన మాతృ సంస్థకు వెళ్లిపోయారు. దాంతో ఇన్‌చార్జి బాధ్యతలు ఇంజనీరింగ్ అధికారికి అప్పగించారు. కొత్తగా ఏపీటీడీసీకి డివిజనల్ మేనేజర్ వచ్చారు. అత్యంత కీలకమైన రీజనల్ డైరెక్టర్ పోస్టు మాత్రం ఇంకా భర్తీ చేయలేదు. ఇక్కడ పర్యాటక శాఖలో ఆధిపత్య పోరు నడుస్తోంది. అంతా తమ కనుసన్నల్లో జరగాలని కొందరు బలంగా కోరుకుంటున్నారు. ఆ గొడవలో పడి బీచ్ నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. పరికరాల నిర్వహణ సరిగ్గా లేదు. బీచ్‌ను నిత్యం శుభ్రం చేసేవారికి మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. వారు పండుగ పూట కూడా పస్తులు ఉండాల్సి వచ్చింది. దసరా నుంచి సీజన్ బాగుంది. మంచి ఆదాయం వస్తోంది. అయినా జీతాలు ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదని, గట్టిగా అడిగితే పనిలో నుంచి తీసేస్తారని భయంగా ఉందని అక్కడి కార్మికులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులే కాకుండా రాష్ట్ర స్థాయి అధికారులు కూడా విశాఖపట్నం పర్యాటక శాఖపై పెద్దగా దృష్టిపెట్టడం లేదని ఆది నుంచి ఆరోపణలు ఉన్నాయి. విజయవాడ నుంచి నాయకులు, అధికారులు విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు ఆ శాఖ అధికారులే అన్ని ఏర్పాట్లు చేస్తున్నందున వారిని ఏమీ అనలేకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ ఆధిపత్య పోరుకు చెక్ పెట్టి, చిత్తశుద్ధితో పర్యాటక అభివృద్ధికి పనిచేసే వారికి అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది.



రుషికొండ బీచ్

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండీ, చెన్నై-600032. నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2), భవనం సంఖ్య 02, బిరం క్యూ పార్క్ జనరల్4/1, TTC, థానే బేలాపూర్ రోడ్, ఘన్సోలి, నవీ ముంబై-400710

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

AUCTIONDATE 25.01.2025,SHRIRAM FINANCE LTD,ZONAL OFFICE,D.NO-14-1-2/B,GROUND FLOOR,NOWROJI ROAD,MAHARANI PETA, VISAKHAPATNAM - 530002.

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
CHWTRPJ2407050001	GAYATHRI MAJJI	MRNPTPJ2407200005	MADHUSUDHAN RAO PADALA
CHWTRPJ2407090001	CHINNAMLU KADIRI		
CHWTRPJ2407100001	VIJAYA KELLA KELLA	MRNPTPJ2407200003	MADHUSUDHAN RAO PADALA
CHWTRPJ2407110001	SASHI KUMAR POTNURU		
CHWTRPJ2407160003	BHARATH KUMAR MADEM	MRNPTPJ2407220002	ESWARI ALLABOYINA
CHWTRPJ2407180002	PEDDOJU NIRMAL KUMAR	MRNPTPJ2407230001	RAMU PATNANA
CHWTRPJ2407190002	VASU AJAY	MRNPTPJ2407240003	DHANALAKSHMI VALISETTY
CHWTRPJ2407200005	PEDDOJU NIRMAL KUMAR	MRNPTPJ2407240001	DHANALAKSHMI VALISETTY
CHWTRPJ2407200006	SANDEEP KANTUMUCHU	MRNPTPJ2407240002	DHANALAKSHMI VALISETTY
CHWTRPJ2407220006	RAMALAKSHMI KATHILA	MRNPTPJ2407240004	DHANALAKSHMI VALISETTY
CHWTRPJ2407230002	VENKATA SIVAPRASAD D	MRNPTPJ2407260002	GANAPATHI CHOLLANGI
CHWTRPJ2407240002	MALLIREDDY DORABABU	MRNPTPJ2407270002	V A N SATYA THRINADH
CHWTRPJ2407260002	RAMALAKSHMI KATHILA	MRNPTPJ2407270003	SURESH POLIPILLA
CHWTRPJ2407270007	PEDDOJU NIRMAL KUMAR	MRNPTPJ2407310005	SURESH POLIPILLA
CHWTRPJ2407270002	PEDDOJU NIRMAL KUMAR	MRNPTPJ2407310007	NITISH ROY KOYYA
CHWTRPJ2407270012	VIJAYA KELLA KELLA	MRNPTPJ2407310008	NITISH ROY KOYYA
CHWTRPJ2407310003	VIJAYA KELLA KELLA	PNRTHPJ2407050002	RAMESH BABU BALIREDDI
CHWTRPJ2407310002	PEDDOJU NIRMAL KUMAR	PNRTHPJ2407050001	DASARI APPALARAJU
CHWTRPJ2406260007	IJJADA UMAMAHESWARARAO	PNRTHPJ2407130003	TAMARAPU SHIVAJI
		PNRTHPJ2407130008	SANTHOSH KUMAR BALIREDDI
CHWTRPJ2406220002	ANUSHA MALLIREDDY		
CHWTRPJ2406220001	ANUSHA MALLIREDDY	PNRTHPJ2407130001	NOOKARAJU DOMA
VZGCTPJ2407020001	JAGADEESH	PNRTHPJ2407130011	SATYANARAYANA PENDURTHI
VZGCTPJ2407040001	TIRUMA REDDI SURI BABU		
VZGCTPJ2407080002	RAMANABABU	PNRTHPJ2407130012	SATYANARAYANA PENDURTHI
VZGCTPJ2407090002	POLA RAO		
VZGCTPJ2407150006	DEVA	PNRTHPJ2407130013	SATYANARAYANA PENDURTHI
VZGCTPJ2407200001	DHARANI TEKI		
VZGCTPJ2407240004	KIRAN KUMAR MADUGULA	PNRTHPJ2407150001	RAMANA BANDAM
VZMVPPJ2407240001	PALLAVI KUPPAM	PNRTHPJ2407200001	NOOKARAJU DOMA
VZMVPPJ2407250001	PALLAVI KUPPAM	PNRTHPJ2407220002	NAGARAJU GANDREDDI
VZMVPPJ2407310001	PALLAVI KUPPAM	PNRTHPJ2407240002	NOOKARAJU DOMA
MDWDAPJ2407080001	RAMANA SATYALA	PNRTHPJ2407260004	NOOKARAJU DOMA
MDWDAPJ2407200002	RAMANA SATYALA	PNRTHPJ2407270001	NOOKARAJU DOMA
MRNPTPJ2407060001	SURADA NALLA BABU	PNRTHPJ2407290005	NAGABABU GOKADA
MRNPTPJ2404060001	PASUPULETE SRINIVAS	PNRTHPJ2407300001	MAHESH GANTLA
MRNPTPJ2407080002	MADHUSUDHAN RAO PADALA	VIZA2PJ2407060002	DEEPA ALLU
		VIZA2PJ2407090002	DEEPA ALLU
MRNPTPJ2407080003	MADHUSUDHAN RAO PADALA	VIZA2PJ2407090001	DEEPA ALLU
		VIZA2PJ2407100001	DEEPA ALLU
MRNPTPJ2407200006	MADHUSUDHAN RAO PADALA	VIZA2PJ2407100002	KARAKAVALASA RAJESH
		VIZA2PJ2407180001	SAMBAIAH BOLAGANI
MRNPTPJ2407200004	MADHUSUDHAN RAO PADALA	VIZA2PJ2407220002	KARAKAVALASA RAJESH

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ ఎ.జగదీష్‌ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 15.01.2025
స్థలం: విశాఖపట్నం

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్


భీమిలి పట్టణంలో మకరజ్యోతి ప్రదర్శన


పద్మనాభం : రాజవీధిలో స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు


సింహాచలం దేవస్థానంలో గోపూజ చేస్తున్న ఈఓ త్రినాథరావు

ఊరూ వాడా సంబరం

- ఘనంగా సంక్రాంతి, కనుమ
- ఆనందంగా పండగలు జరుపుకొన్న ప్రజలు

భీమునిపట్నం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రజలు సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా జరుపుకొన్నారు. మంగళవారం సంక్రాంతి సందర్భంగా కొన్ని గ్రామాల్లో ముగ్గుల పోటీ నిర్వహించగా, మరికొన్నిచోట్ల కోలాటాలు ప్రదర్శించారు. భీమిలి, రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌ల్లో పతంగులు ఎగరవేశారు. బుధవారం కనుమ పురస్కరించుకుని గోపూజ జరిపారు. భీమిలిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి, కల్యాణ వెంకటేశ్వరస్వామి, ఐశ్వర్య వెంకటేశ్వరాలయాన్ని, నూకాలమ్మను భక్తులు దర్శించుకున్నారు. బీచ్ రోడ్‌లో వున్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద మకర జ్యోతి వెలిగించారు. తొలుత గురుస్వామి బొండా బదిరీ నారాయణమూర్తి ఇంటి నుంచి స్వామివారి ఆభరణాలను పూర్ణ కలశములతో పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బి.పాండే, పట్టణ పురోహితులు సుసరాపు కామేశ్వర మాధవశాస్త్రి, భీమిలి వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం అధ్యక్షుడు ఎర్రు నాయుడు, ప్రధాన కార్యదర్శి మొకర నరసింగరావు, కోశాధికారి పిల్లి శ్రీను, కదిరి జగన్నాథం, హిందూ పరిరక్షణ సమితి కన్వీనర్ మైలపల్లి షణ్ముఖరావు, ప్రజా నాయకుడు గంటా నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

భీమిలి బీచ్‌లో పతంగుల పండుగ

భీమిలి తీరంలో బుధవారం పతంగుల ఎగరవేత ఉత్సాహంగా సాగింది. ఫ్రెండ్స్ అసోసియేషన్ (పాబ్), ప్రెస్‌క్లబ్ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తీరం గాలిపటాల ఎగరవేతతో నిండిపోయింది. రంగు రంగుల గాలిపటాలు ఎగర వేయడంతో ఆకాశంలో హరివిల్లు కనిపించినట్టు అయ్యింది. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా అందరూ ఈ వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కాళ్ల సన్నీ, మునునూరి శ్రీనివాసరావు, అడిదం కిశోర్, మారోజు గోపి, తెడ్డు రామదాసు, స్నేహలత, దేవానంద్ పాల్గొన్నారు.

అనంతుని గిరి ప్రదక్షిణ

పద్మనాభం : పద్మనాభంలో అనంత పద్మనాభుడి క్షేత్రంలో కనుమ సందర్భంగా బుధవారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు హోమాలు చేసిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉభయ దేవేరులతో అనంత పద్మనాభుని ఉంచి రాజవీధిలో ఊరేగించారు. అక్కడి నుంచి ఇసకలపాలెం మీదుగా దేవస్థానం పూలతోటలో ఉన్న మండపం వద్ద స్వామివారు సేదతీరారు. అక్కడ భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. తిరిగి అర్చకునిపాలెం మీదుగా అనంతగిరి చుట్టూ ప్రదక్షిణ చేసి కుంతీమాధవస్వామి ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు వెంకటాచారి, పవన్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎర్నాయుడు, పద్దు, పైడిరాజు, రమణ, సూరిబాబు పాల్గొన్నారు. కృష్ణాపురం, పద్మనాభం పంచాయతీల్లో మంగళవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. మద్దిలోని ధర్మశాస్తా అయ్యప్ప పీఠంలో మకర జ్యోతి వేడుకలు మంగళవారం రాత్రి అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ముందుగా సామవేదం బదరికా వాసు ఆధ్వర్యంలో స్వామికి విశేష అర్చనలు, షోడశోపచార పూజ నిర్వహించారు. అనంతరం శబరిమలలో మకర జ్యోతి దర్శనమయ్యే సమయంలోనే పీఠంపై మకరజ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, పీఠం ప్రతినిధులు బుగత సత్యనారాయణ, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎండాడ : ఎండాడ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాదు రాజు ఆధ్వర్యంలో ఎండాడ రామాలయంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. వేడుకల్లో భాగంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. అనంతరం ఎండాడ కోదండ రామాలయం, వినాయక, పశుపతినాథేశ్వర ఆలయానికి సంబంధించిన క్యాలెండర్‌ను ఆలయ ధర్మకర్త చెట్టుపల్లి శంకర్రావు ఆవిష్కరించి, సభ్యులకు అందజేశారు. బుధవారం భజన చెట్టును గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో చెట్టుపల్లి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, చెట్టుపల్లి సన్యాసిరావు గ్రామ కమటీ సభ్యులు పాల్గొన్నారు.


కృష్ణాపురం గ్రామంలో ముగ్గుల పోటీ

సింహాచలంలో ఘనంగా గో పూజ

సింహాచలం : గోమాతను పూజిస్తే సకల దేవతలను ఆరాధించినట్టేనని సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అన్నారు. కనుమ సందర్భంగా బుధవారం కృష్ణాపురం గోశాలలో గో పూజా మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు లోకకల్యాణర్థం గోపాలునికి, గోసంతతికి షోడశోపచార పూజలు చేశారు. అప్పన్న పోటులో తయారు చేసిన బూరెలు, గారెలను నివేదించి, గోవులకు తినిపించారు. భక్తులు గో పూజలు చేసి బెల్లం, పశుగ్రాసాన్ని తినిపించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఎన్.ఆనందకుమార్, వీటీవీ రమణమూర్తి, పర్యవేక్షణాధికారులు జీవీవీఎస్‌కే ప్రసాద్, సత్యవాణి, సిబ్బంది పాల్గొన్నారు.


ఎండాడలో ఊరేగిస్తున్న భజన చెట్టు


భీమిలి బీచ్‌లో గాలిపటాలతో సందర్శకులు


కొండ దిగువన తొలిపావంచ వద్ద స్వామివారికి స్వాగతం పలుకుతున్న భక్తులు

వైభవంగా గజేంద్ర మోక్షం

- కన్నుల పండువగా సాగిన ఉత్సవం
- వేలాదిగా పాల్గొన్న భక్తులు

సింహాచలం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఏటా మాదిరిగానే కనుమ నాడు గజేంద్ర మోక్షోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం 3.45 గంటలకు వరాహలక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వరద రాజాలంకారంలో పల్లకీపై మెట్ల మార్గంలో కొండ దిగువకు తీసుకువచ్చారు. తొలిపావంచా వద్ద దేవస్థానం ఏఈఓలు ఆనందకుమార్, రమణమూర్తి అధికారికంగా హారతులివ్వగా అడివివరం, సింహాచలం, విజినిగిరిపాలెం, పెందుర్తి తదితర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారికి కర్పూర నీరాజనాలు ఇచ్చి స్వాగతించారు. తొలిపావంచా నుంచి బయలుదేరిన స్వామివారు తన సోదరి, అడివివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి ఆలయానికి వెళ్లి పసుపు కుంకుమ ఇచ్చి తిరిగి పూదోటకు చేరుకున్నారు. అక్కడ శోభాయమానంగా తీర్చిదిద్దిన మండపంలో ఆశీనులయ్యారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు,అలంకారి కరి సీతారామాచార్యులు సారథ్యంలో ఉత్సవానికి అర్చకులు శ్రీకారం చుట్టారు. ఆస్థాన విద్వాంసులు నాదస్వర కచేరీ చేయగా చతుర్వేద పండితులు వేదాలను పఠించారు. మహాభాగవతంలోని గజేంద్రమోక్ష ఘట్టాన్ని అధ్యాపకులు రాజేష్, స్థానాచార్యులు రాజగోపాల్ సంయుక్తంగా గజ, మకర సంవాదాన్ని పఠించగా అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పూదోటలోని కొలను ఒడ్డున మకరి, గజేంద్రుల ప్రతిమలను ఉంచి, ఆచారం ప్రకారం మకరాన్ని సంహరించి గజేంద్రుని రక్షించేందుకు గురుతుగా మూడుసార్లు పైనుంచి కిందికి తారాజువ్వలను వదిలారు. మొసలి సంహారం పూర్తి కావడంతో బాణసంచా కాల్చి ఆనందోత్సాహాలను ప్రకటించారు. తరువాత స్వామివారిని పుష్కరిణీ సత్రం ఆవరణలోని ఉద్యానవన మండపంలో కాసేపు ఉంచి సిబ్బంది భోజన విరామం తర్వాత ఇత్తడి గజ వాహనంపై కొండ దిగువ మూడు ప్రధాన మాడవీధుల్లో తిరువీధి జరిపారు. ఉత్సవంలో భాగంగా దేవాలయ సిబ్బంది పలుమార్లు బాణసంచాను కాల్చగా మహిళలు వాకిళ్ల ముందు వివిధ ఆకృతుల్లో రంగవల్లును శోభాయమానంగా తీర్చిదిద్ది స్వామివారికి భక్తితో స్వాగతం పలికారు. మరికొందరు స్వామివారి తిరువీధి పురస్కరించుకుని సంప్రదాయ దుస్తుల్లో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణలు చేశారు. అనంతరం స్వామివారు మెట్ల మార్గంలో తిరిగి సింహగిరికి చేరుకోవడంతో రాత్రి ఆరాధన, పవళింపు సేవ నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వాహక ఇంజినీర్ బందారు రాంబాబు, పర్యవేక్షణాధికారులు రాజ్యలక్ష్మీ, సత్యవాణి,పాలూరి నరసింగరావు ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. గోపాలపట్నం శాంతి భద్రతా విభాగం సీఐ గొలగాని అప్పారావు పర్యవేక్షణలో ఎస్ఐ అప్పలనాయుడు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని సుజాతనగర్ ప్రాంతానికి చెందిన సరస్వతి నృత్య విద్యాలయం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పివి నరసింహం, తదితరులు పాల్గొన్నారు. కాగా ఈఏడాది పంటలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉత్సవంలో భాగంగా వేసే తారాజువ్వల గమనాన్ని బట్టి పంట పరిస్థితులను రైతులు అంచనా వేస్తుంటారు.మూడు జువ్వలను బట్టి ముక్కారు పంటలు అనగా వరి, అపరాలు, మెట్ట (జీడి, మామిడి,పనస)పంటల దిగుబడిపై అంచనాకు వస్తారు. ఈ ఏడాది మూడు జువ్వలు విజయవంతంగా పైకి వెళ్లడంతో పంటలు ఆశాజనకమేనని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏఈఓపై ఎమ్మెల్యే గంటా అసహనం

సింహాచలం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఉత్సవం నిర్వహణపై ఎమ్మెల్యే గంటా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్పొరేటర్ నరసింహంతో కలిసి చిన్నారుల నాట్య ప్రదర్శన చూడడానికి వచ్చిన ఆయన అక్కడ స్టేజ్ ఏర్పాట్లు బాగాలేకపోవడంతో విస్తుపోయారు. ఎక్కువ మంది ఒకేసారి నాట్యం చేసే సమయంలో స్టేజ్ ఊగిపోతూ, ఒకదశలో కూలిపోతుందా అన్న ఆందోళన కలిగింది. ఆ సమయంలో స్టేజ్ ఐరన్ పోల్స్‌కు నట్లు బిగించడం చూసి ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చవకబారు స్టేజ్ ఏర్పాట్లు చేసి, నాట్యం చేయించడం సరికాదని ఏఈఓ ఆనంద్ కుమార్‌పై అసహనం వ్యక్తం చేశారు. స్టేజ్ కూలిపోతే ఎవరు బాధ్యులని నిలదీశారు. దీంతో అప్పటి వరకు అక్కడే ఉన్న ఇంజనీరింగ్ సిబ్బంది ఈ తంతు చూసి జారుకోవడంతో స్టేజ్ విషయమై ఇంజనీరింగ్ విభాగం వివరణ తీసుకుని తనకు తెలియజేయాలని ఏఈఓను గంటా ఆదేశించారు.

ముగిసిన ధారోత్సవాలు

సింహాచలం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఈనెల 10వ తేదీ నుంచి జరుగు తున్న ధారోత్సవాలు మంగళవారం జరిగిన నీరాటోత్సవంతో పూర్తయ్యాయి. చివరి రోజు సింహవల్లీ తాయార్, చతుర్భుజి తాయార్, సువర్ణ అమ్మవారు, నీలాదేవి, భూదేవి, గోవిందరాజస్వామి, ఆళ్వార్ల విగ్రహాలను పల్లకిలో గంగధార వద్దకు తోడ్కొనివెళ్లారు. అక్కడ ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను ఉంచి పండితుల వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు, గంగధార జలాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం దివ్యప్రబంధంలోని నీరాట్ ఘట్టాన్ని పారాయణం చేసి సేవాకాలం నిర్వహించారు.

వామనుడిగా అప్పన్న స్వామి

సింహాచలం, జనవరి 15 (ఆంధ్ర జ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా స్వామివారు వామనుడి అవతారంలో భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని శంఖు, చక్రాలు, ఛత్రంతో పాటు కమండలం ధరించిన వామనుడిగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ప్రత్యేక పూజలు తరువాత మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 3 లక్షల విరాళం

సింహాచలం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి ముగ్గురు దాతలు వేర్వేరుగా రూ. 3 లక్షల విరాళంగా సమర్పించారు. అనకాపల్లికి చెందిన మంతెన కిరణ్ రూ.1,00,116లను చెక్కు రూపంలో, గాజువాకకు చెందిన గోక్యాడ బుచ్చినాయుడు రూ.1,01,116లు చెక్కు రూపంలో, ఎండాడ ప్రాంతానికి చెందిన బీఎస్ ప్రభావతి రూ.1,11,111 నగదు రూపంలో ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి సునీల్‌కుమార్‌కు బుధవారం అందజేశారు.

కబడ్డీ పోటీల విజేత జామి

పద్మనాభం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఎంపీపీ రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో విజయనగరం జిల్లా జామి గ్రామానికి చెందిన జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో వీఆర్‌పేట, నరవ జట్లు గెలుపొందాయి. విజేతలకు రూ. 7 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

విహారంలో విషాదం

- రేవుపోలవరం వద్ద సముద్రంలో ఇద్దరు గల్లంతు
- బాలుడి మృతి, జాడలేని యువకుడు

ఎస్.రాయవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం వద్ద బుధవారం సముద్ర తీరంలో ఇద్దరు గల్లంతయ్యారు. వారిలో ఒకరిని సమీపానున్న వారు రక్షించి, ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడు. మరొకరి ఆచూకీ లభించలేదు. నక్కపల్లి సీఐ రామకృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరుకి చెందిన పలువురు కుటుంబాలతో సహా బుధవారం రేవుపోలవరం వచ్చారు. తీరంలో సరదాగా గడుపుతుండగా అలల తాకిడికి బాషణపోయిన సాత్విక్ (10) మునిగిపోయాడు. గమనించిన కాకర్ల మణికంఠ (23)..సాత్విక్‌ను రక్షించడానికి వెళ్లాడు. అలల ఉధృతితో అతడూ గల్లంతయ్యాడు. తీరంలో ఉన్నవారు కేకలు వేయడంతో మత్స్యకారులు సాత్విక్‌ను బయటకు తెచ్చారు. నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. గల్లంతైన మణికంఠ కోసం మెరైన్ పోలీసులు గాలిస్తున్నారు. లోవకొత్తూరుకు చెందిన రాము, సరోజని దంపతుల కుమారుడు సాత్విక్ నాలుగో తరగతి చదువుతున్నాడు. మణికంఠ పత్తిపాడు మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన రాము, పార్వతి దంపతుల కుమారుడు. ఈ సంఘటనతో విహారయాత్ర విషాదంగా మారింది.

ఎంపీఎల్-2 విజేత మన్యాల బుల్స్

కొమ్మాది, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పురస్కరించుకుని మారికవలసలో బుధవారం ఎంపీఎల్-2 క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆరు జట్లు పాల్గొనగా ఫైనల్స్‌కు మన్యాల బుల్స్ దేవర ఏ లెవన్ జట్లు చేరాయి. వీటిలో మాన్యల బుల్స్ జట్టు విజేతగా నిలిచింది. వారికి గ్రామ పెద్దల సమక్షంలో నిర్వాహకులు ట్రోఫీ అందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు, జెఎస్ రెడ్డి, మన్యాల సురేశ్, రామారావు, సింహాచలం, శివ, వెంకటరమణ, రామునాయుడు, రమణ, పాల్గొన్నారు.

పండగ పూట విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఎండాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. ఎండాడ, సీతంపేట, గాజువాక, కంచరపాలెంలో జరిగిన ఈ సంఘటనలపై వివరాలు ఉన్నాయి. ఎండాడలో జరిగిన ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. ఈ సంఘటన కారుషెడ్డు ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పద్మనాభం మండలం పాండ్రంగికి చెందిన మైలపల్లి సూరి,భార్య చందు (28) ఉపాధి రీత్యా నగరానికి వచ్చి వెంకోజీపాలెం ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో ఉంటున్నారు. శ్రీను డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి సందర్భంగా ద్విచక్ర వాహనంపై భార్య, కుమారుడితో కలిసి సొంతూరుకు బయలుదేరారు. వారి వాహనం కారుషెడ్ ప్రాంతానికి చేరుకునే సరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో చందు రోడ్డుపై పడిపోయింది. ఆమె పైనుంచి లారీ వెనుక టైర్లు వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన డ్రైవర్ డి.రామకృష్ణ లారీని అమిత వేగంతో నిర్లక్ష్యంగా నడపడంతోనే చందు మృతి చెందిందని భర్త శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాజువాకలో కారు ఢీకొని ఐదేళ్ల బాలిక ..

గాజువాక : పండగ నేపథ్యంలో అందరూ ఆనందంగా గడుపుతుండగా ఆ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఐదేళ్ల చిన్నారిని కారు ఢీకొనడంతో మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుజాతనగర్ ప్రాంతానికి చెందిన బి.నవీన్‌కుమార్ విదేశాల్లో ఉంటుండగా, ఆయన భార్య కుమార్తె లార్నీ (5) ఇక్కడే ఉంటున్నారు. సంక్రాంతి పండక్కి గాజువాకలో గల సెలెస్ట్ అపార్ట్‌మెంటులో ఉంటున్న తాతాయ్య వాళ్లింటికి లార్నీ తల్లితో కలిసి వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో కొంతమంది పిల్లలతో కలిసి లార్నీ ఆడుకుంటుండగా.. ఓ వ్యక్తి సెల్లార్ నుంచి కారును బయటకు తీస్తూ బలంగా ఆ బాలికను ఢీకొన్నాడు. లార్నీ తలపై నుంచి కారు చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. హుటాహుటిన ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం నుంచి తుళ్లిపడి యువకుడు ..

సీతంపేట : ఓ ద్విచక్ర వాహనం డివైడర్‌పైకి వెళ్లడంతో వెనుక కూర్చున్న వ్యక్తి తుళ్లి కిందపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. రామాటాకీస్ రోడ్డు ప్రాంతీయ కంటి ఆసుపత్రి వద్ద ఈ సంఘటన జరిగినట్టు ద్వారకా పోలీసులు తెలిపారు. తాటిచెట్లపాలెం సోనియాగాంధి నగర్‌కి చెందిన గులివిందుల శ్రీనివాసరావు తన స్నేహితుడు సిద్ది చంద్రమౌళి (22)తో కలిసి ఈ నెల 13న రాత్రి రామాటాకీస్ రోడ్డుకి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా కంటి ఆసుపత్రి వద్ద రోడ్డుపై ఉంచిన పెద్ద డివైడర్‌పైకి ద్విచక్రవాహనం తూలిపోయింది. దీంతో వాహనం వెనుక కూర్చున్న చంద్రమౌళి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేశారు. చంద్రమౌళి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు.



బాలిక లార్నీ (ఫైల్), మృతుడు చంద్రమౌళి

అనుమానాస్పద స్థితిలో గృహిణి ...

కంచరపాలెం : అనుమానాస్పద స్థితిలో ఒక గృహిణి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రేటర్ విశాఖ 47వ వార్డు పరిధి మధుసూదన్ నగర్‌లో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మధుసూదన్ నగర్‌లో నివాసం ఉంటున్న వల్లూరి ప్రసన్న లక్ష్మి (30) నాలుగేళ్ల కిందట (2021) నక్క భరద్వాజ్‌ని ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. భరద్వాజ్ హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నాడు. ప్రసన్న లక్ష్మి రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేసేది. పండుగ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ప్రసన్న లక్ష్మి శివాజీపాలెంలో కన్నవారింటికి వెళ్లింది. ఇంటికి వచ్చిన ప్రసన్న లక్ష్మి చిన్నబోయి కనిపించడంతో తల్లిదండ్రులు ప్రశ్నించారు. తన భర్త వద్దకు వెళ్లి వస్తానని చెప్పి తల్లిదండ్రుల వద్ద తన కుమారుడిని వదిలి ఇంటికి వెళ్లిన ఆమె మంగళవారం రాత్రి సమయంలో ఇంట్లో పూజ చేసే దేవుడి బల్ల వద్ద కాలిపోయిన స్థితిలో విగతజీవిగా పడి ఉంది. అందిన సమాచారం మేరకు కంచరపాలెం పోలీసులతో పాటు ఫైర్ సేఫ్టీగా అధికారులు ఘటన స్థలానికి చేరుకుని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు కేసు దర్యాప్తు చేస్తున్న కంచరపాలెం సీఐ చంద్రశేఖర్ వెల్లడించారు.

స్కూల్ కాంప్లెక్స్‌లు పునర్వ్యవస్థీకరణ

... 5వ పేజీ తరువాయి

పరిధిలో 40 నుంచి 50 మంది ఉపాధ్యాయులు, 800 నుంచి 1,000 మంది విద్యార్థులు ఉండేలా చూసుకోవాలి. ఇంకా ఒక పంచాయతీ పరిధిలో ఉన్న పాఠశాలలన్నింటినీ ఒక స్కూల్ కాంప్లెక్స్ కిందకు తీసుకురావాలి తప్ప రెండుగా విభజించకూడదని పాఠశాల విద్యా శాఖ స్పష్టం చేసింది. గతంలో యూపీ పాఠశాలలను స్కూల్ కాంప్లెక్స్ కేంద్రాలుగా గుర్తించగా ఇప్పుడు వాటిని రద్దు చేశారు.

స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు పలు బాధ్యతలు అప్పగించనున్నారు. తన పరిధిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల పర్యవేక్షణను ఆయనే చూడాలి. టీచర్ల పనితీరు, జీతాలు డ్రా చేయడం, సెలవులు మంజూరుచేయడం, ఇతర పాలనాపరమైన బాధ్యతలు చూడాల్సింది కూడా కాంప్లెక్స్ హెచ్‌ఎంలే. తన పాఠశాలతోపాటు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణ చూడాలి. అయితే...జిల్లాలో కాంప్లెక్స్‌లుగా గుర్తించిన పలు ఉన్నత పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది లేరు. అటువంటప్పుడు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సుమారు 40 నుంచి 50 మంది టీచర్ల బిల్లులు, ఇతర అంశాలు, పరీక్షల నిర్వహణకు సంబంధించి వ్యవహారాలు చూసుకోవడం హెచ్‌ఎం ఒక్కరి వల్ల కాదని సీనియర్ హెచ్‌ఎం ఒకరు వ్యాఖ్యానించారు. స్కూల్ కాంప్లెక్స్‌లలో ఉన్న సీఆర్పీలకు సమగ్రశిక్షా అభియాన్ అనేక పనులు అప్పగిస్తోంది. మండల విద్యా శాఖ కార్యాలయంలో పనులను ఉపాధ్యాయులే చేస్తున్నట్టు భవిష్యత్తులో స్కూలు కాంప్లెక్స్‌లో గుమస్తా పనులను టీచర్లకు అప్పగించే అవకాశం ఉందని మరో టీచరు అభిప్రాయపడ్డారు.

పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఏ విధానం అమలుచేసినా ఇబ్బందిలేదని, అందుకు తగిన విధంగా వ్యవస్థను ఏర్పాటుచేయాలని కోరారు. ఇప్పటివరకూ తూతూమంత్రంగా ఉన్న స్కూల్ కాంప్లెక్స్‌లను బలోపేతం చేయాలన్న ఆలోచనకు అనుగుణంగా అన్ని వనరులు సమకూర్చాలని ఆయన సూచించారు.

అక్రమాలకు మహా ఊతం

... 5వ పేజీ తరువాయి

ఏసీపీకి, ఫార్వాడ్ చేశారు. దరఖాస్తును పరిశీలించిన ఏసీపీ కొన్ని రిమార్కులు రాసి అదేనెల 23న డీసీపీకి ఫార్వాడ్ చేశారు. డీసీపీ కూడా అదేరోజున దరఖాస్తుపై కొన్ని రిమార్కులు రాసి తన లాగిన్ నుంచి సిటీ ప్లానర్ (సీపీ)కి ఫార్వాడ్ చేశారు. అయితే సీపీ లాగిన్‌కు వెళ్లేసరికి వార్డు ప్లానింగ్ సెక్రటరీ షార్ట్ ఫాల్‌లో రాసిన రిమార్కులను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఆస్తి పన్ను చెల్లించినట్టు లేటెస్ట్ రశీదు, ప్లాన్‌లో ఎన్ని ఫ్లోర్‌లు కడుతున్నారు, భవనం ఎలివేషన్ డిజైన్ మాత్రమే లేదని, కోర్టులో పెండింగ్‌లో ఉన్న రెండు కేసులను పరిష్కరించుకుని దరఖాస్తును రీ సబ్మిట్ చేయాలంటూ అదేనెల 25న షార్ట్‌ఫాల్ చూపించారు. అయితే వార్డు ప్లానింగ్ సెక్రటరీ షార్ట్‌ఫాల్‌లో చూపించిన రిమార్కులు సిటీ ప్లానర్ లాగిన్‌కు వచ్చేసరికి కనిపించకపోవడం, ఏదో షార్ట్ ఫాల్‌లో పెట్టామని చెప్పుకోవడానికి అన్నట్టు మొక్కుబడిగా సులభంగా పరిష్కరించుకోగలిగే రిమార్కులు మాత్రమే కనిపించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అత్యంత కీలకమైన ఆ స్థలం లేఅవుట్‌లో రిజర్వు స్పేస్ కింద చూపించారని, ఆ స్థలానికి సంబంధించినది కాకుండా వేరొక స్థలానికి సంబంధించిన ఆస్తి పన్ను రశీదు చూపించారనే రిమార్కులను వేర్వేరు స్థాయిల్లో అధికారులు తొక్కిపెట్టి, సిటీ ప్లానర్ వద్దకు వెళ్లేసరికి కేవలం చిన్నపాటి రిమార్కులు రాసి దరఖాస్తును తిరిగి సమర్పించాలని షార్ట్ ఫాల్‌లో రాయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా కింది స్థాయి అధికారి లేవనెత్తిన అభ్యంతరాలకు దరఖాస్తుదారుడు రీసబ్మిట్ చేసినప్పుడు మాత్రమే తగిన పత్రాలతో నివృత్తి చేయడానికి అవకాశం ఉంటుంది. దరఖాస్తును పరిశీలించిన అధికారి ఆయాపత్రాలు సరైనవేనని, ప్రతిపాదిత స్థలానికి సంబంధించినవేనని, ఆ స్థలంపై ఎలాంటి వివాదాలు లేవని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే తన లాగిన్‌లో తాను సంతృప్తిచెందినట్టు రిమార్కురాసి ఆమోదానికి తన పైఅధికారికి ఫార్వాడ్ చేయాల్సి ఉంటుంది. కానీ ఈ స్థలం విషయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఒక్కో స్థాయిలో ఒక్కోలా రిమార్కులు రాయడం, దరఖాస్తుదారుడుకు మేలు చేసేలా వ్యవహరించారంటూ ప్రచారం జరుగుతోంది. దీనిపై చీఫ్ సిటీ ప్లానర్, జీవీఎంసీ కమిషనర్ లోతుగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బోసిపోయిన నగరం

... 5వ పేజీ తరువాయి

సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం సుమారు 50 నుంచి 60 టన్నుల మాంసం విక్రయమైంది. ఇంతకు ముందు కిలో మాంసం రూ.900-940 ఉండేది. బుధవారం వేయి రూపాయలు చేసేశారు. దాంతో రూ.5 కోట్ల వ్యాపారం జరిగింది. అలాగే ఆదివారం నగరంలో దాదాపు ఐదు లక్షల కోళ్లను విక్రయిస్తుంటారు. కానీ బుధవారం చికెన్‌కు పెద్దగా డిమాండ్ కనిపించలేదు. దాంతో రెండు లక్షల కోళ్లు మాత్రమే విక్రయించగలిగామని వ్యాపారులు తెలిపారు. కిలో సగటున రూ.250 చొప్పున అమ్మామని, పెద్దగా లాభం లేదని పేర్కొన్నారు.

కనిపించని మందుబాబులు సందడి

సంక్రాంతి పండుగకు నగరంలో మందుబాబుల సందడి పెద్దగా కనిపించలేదు. అత్యధికులు స్వస్థలాలకు వెళ్లిపోవడంతో నగరంలో మద్యం దుకాణాలకు గిరాకీ పడిపోయింది. ఆదివారాల్లో ఉండే బేరం కూడా లేకుండా పోయిందని పలువురు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు కలిపి రూ. 20 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరిగి ఉంటాయని ఓ అధికారి తెలిపారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత

... 5వ పేజీ తరువాయి

మారుమూల ప్రాంతాల్లో ఉన్న లేఅవుట్‌ల వద్దకు ఇసుక సరఫరా చేసేందుకు లారీ యజమానులు ముందుకురావడం లేదు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న లేఅవుట్‌లకు మాత్రమే సరఫరా చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఒక రీచ్ మూసివేత, రాజమండ్రి నుంచి పూర్తిగా ఇసుక అందకపోవడం, రవాణా చార్జీలు తగ్గడం వంటి అంశాల ప్రభావంతో జిల్లాలో ఇళ్ల నిర్మాణాలకు తగినంత ఇసుక రాకపోవడంతో పనుల జోరు తగ్గింది. ఈ నేపథ్యంలో గృహ నిర్మాణ సంస్థ అధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

భీమునిపట్నం (రూరల్) జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు రూపొందించిన నూతన క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు డీఏఎస్ రాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్. అప్పారావు, మాజీ సర్పంచ్ ఎం. వెంకటరావు, మజ్జివలస ఉప సర్పంచ్ నీలాపు సూర్యనారాయణ , తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పండగ

- మూడు రోజుల పాటు ప్రతి ఇంటా వెల్లివిరిసిన ఆనందం
- కుటుంబ సభ్యులు, చుట్టాలతో గడుపుతూ సరదాగా కాలక్షేపం
- బీచ్‌కు తరలివెళ్లి ఆటాపాటా


వెంకోజీపాలెంలో హౌసీ సందడి

వెంకోజీపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వ్యాపారాలు, ఉద్యోగాలతో బిజీబిజీగా జనం సంక్రాంతి పండుగ నేపథ్యంలో మూడు రోజులుగా బంధుమిత్రులు , స్నేహితులతో సరదాగా గడిపారు. మంగళవారం ఉదయాన్నే బ్రాహ్మణులకు పత్తరు సమర్పించారు. అనంతరం ఇంట్లో సంక్రాంతి పూజ నిర్వహించి కుటుంబ సభ్యులు, చుట్టాలతో కలిసి భోజనాలు చేశారు. ఇతర నగరాలు, ప్రాంతాల్లో ఉద్యోగాలు, చదువుల కోసం దూరంగా వెళ్లిన వారంగా సంక్రాంతి పండుగకు సొంత ఇళ్లకు చేరడంతో కుటుంబ సభ్యులంతా ఆనందంగా గడిపారు. తమ అనుభవాలు, జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. చాలా మంది బీచ్‌కు వెళ్లి ఆనందంగా గడిపారు. మరోవైపు అధిక శాతం మంది స్వగ్రామాలకు వెళ్లిపోవడంతో నగరంలో సందడి కరవడింది. ముఖ్యంగా రోడ్లపై ట్రాఫిక్ అంతగా కనిపించలేదు. దీంతో నగరంలో హాయిగా తిరిగేందుకు అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా.. యువత రోడ్లపై బైక్ రైడింగ్ చేసేందుకు ఇష్టపడ్డారు. పాత వెంకోజీపాలెం గ్రామంలో గ్రామస్థులంతా ఒక చోటికి చేరి సరదాగా హౌసీ ఆట ఆడుతూ గడిపారు. ప్రతీ ఇంటా మహిళలు, చిన్నారులు వివిధ ఆటలతో కాలాన్ని సంతోషంగా గడిపారు. సెల్ ఫోన్‌లో రీల్స్ చేస్తూ హంగామా చేశారు. బీచ్‌కు వెళ్లి గాలిపటాలను ఎగురవేశారు. సాయంత్రం మహిళలు ఇండ్ల ముందు రంగు రంగుల రంగవల్లులు వేశారు. దీంతో వీధులన్నీ ముగ్గులతో నిండిపోయాయి.


నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

ఖాళీగా రహదారులు

ఎప్పుడూ రద్దీగా ఉన్న హనుమంతవాక జంక్షన్ ఖాళీగా కనిపించింది. అలాగే ఇసుకలోగ జంక్షన్ వద్ద కూడా బిజీ కనిపించలేదు. ఇక్కడ బిజీ సమయంలో మూడు, నాలుగు సిగ్నల్స్ వచ్చేవరకు వేచి ఉండే వాహనదారులు గత మూడు రోజులుగా ఒక సిగ్నల్‌కే ముందుకు వెళ్లే అవకాశం ఏర్పడింది. అయితే, సంక్రాంతి సెలవులు ముగియడంతో గురువారం నుంచి కార్యాలయాలు, పలు విద్యాసంస్థలకు తెరవనుండడంతో బుధవారం సాయంత్రానికి నగరానికి పెద్ద ఎత్తున జనం తిరిగి చేరుకుంటూ కనిపించారు. దీంతో నగరం యథావిధిగా రద్దీగా మారుతోంది.

మాంసం దుకాణాలకు కనుమ

- పండుగ సందర్భంగా చికెన్, మటన్‌కు ఎనలేని డిమాండ్
- తెల్లవారి నుంచే షాపుల ముందు క్యూ
- నాటుకోళ్ల కొనుగోలుపై పలువురి ఆసక్తి


డెయిరీ ఫారం ముందు మాంసం దుకాణాల ముందు జనం

ఆరిలోవ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కనుమ పండుగ కావడంతో బుధవారం మాంసాహారానికి ఎనలేని డిమాండ్ పెరిగింది. ఈ ప్రాంతంలోనిమాంసం దుకాణాల వద్ద వేకువ జాము నుంచే జనం క్యూ కట్టారు. కోళ్లు కొని మాంసం చేయించుకోవడానికి సుమారు రెండు గంటల సమయం పట్టిందంటే పరిస్థితిని అంచనా వేయవచ్చు. మాంసం దుకాణాలు అధికంగా గల పాత డెయిరీ ఫారం వద్ద జనం ఎగబడ్డారు. ఈ ప్రాంతంలో బుధవారం ఒక్కరోజే రెండు వేల కిలోల చికెన్ అమ్మినట్టు దుకాణదారులు తెలిపారు. సుమారు రూ.16 లక్షల వ్యాపారం సాగిందని చెప్పారు. అలాగే నాటు కోడి కొనుగోలుకు అధిక శాతం మంది మొగ్గు చూపారు. దీంతో నాటు కోళ్లకు డిమాండ్ పెరిగింది. డెయిరీ ఫారం వద్ద మధ్యాహ్నం వరకూ మటన్ అమ్మకాలు జోరుగా సాగాయి. కొందరు ప్రత్యేకంగా మేక తలకాయ, బోటి (పేగులు), లివర్ కొనుగోలు చేస్తూ కనిపించారు. మేక తలకాయ మాంసం విక్రయాన్ని పలు చోట్ల ప్రత్యేకంగా చేపట్టారు. కనుమ రోజు మాంసాహారం తినడం ఆనవాయితీగా భావించి కొనుగోలు చేస్తున్నామని పలువురు తెలిపారు.

కోడి పందేలపై పోలీసుల దాడి : 9 మందిపై కేసు నమోదు

పెందుర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గుట్టుగా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. సంక్రాంతి రోజున జుత్తాడ, ఫులగాలిపాలెంలో దాడి చేసి పందెం రాయుళ్ల నుంచి ఎనిమిది కోడి పుంజులు, రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నారు. పందేలు ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ అసిరి తాత, సిబ్బంది పాల్గొన్నార

ముగిసిన సంక్రాంతి మహా సంబరాలు


గీతాలు ఆలపిస్తున్న కారుణ్య

మద్దిలపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సంబరాల్లో పల్లె వాతవరణం తలిపించేలా చేసిన ఏర్పాట్లు సందర్శకులకు వినోదం కలిగించాయి. సంక్రాంతి సంప్రదాయాలైన హరిదాసులు, గంగిరెద్దులు, కోలాటాలు వంటి జానపద కళారూపాలు నగరవాసులకు మంత్రముగ్ధులను చేశారు.పల్లె సెట్‌లు, హరిదాసులు, డూడూ బసవన్నలతో యువత సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మ్యూజికల్ నైట్, కామెడీ స్కిట్‌లు అలరించాయి. సంబరాల్లో ఏర్పాటు చేసిన కోలాటం పోటీల్లో 45 బృందాల నుంచి 510 కళాకారులు పాల్గొన్నారు. వీరిలో విజేతగా నిలిచిన శ్రీలక్ష్మీ నరసింహ కోలాటం బృందం గురువు సిరిపురపు సంతోషికి ఐడీబీఐ ఏజీఎం నరేష్ బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రముఖ నేపథ్య గాయకుడు కారుణ్య ఆలపించిన గీతలు అలరించాయి. పెద్ద సంఖ్యలో జనం పాల్గొన్నారు.


సంబరాల్లో పాల్గొన్న జనం

సినిమా గైడ్

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 16, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 50, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 46, బీరకాయలు 58, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 18, క్యారెట్ 46 దొండకాయలు 50, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 52, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీర దోస 40, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడ దుంపలు 44, కంద 76, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 46, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 34, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524


చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

కొత్త అల్లుడికి 100 రకాల వంటలతో భోజనం


దంపతులకు వంద రకాల వంటకాలు వడ్డించిన దృశ్యం

మాడుగుల రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతికి అల్లుళ్లకు అత్తింటివారు ప్రత్యేక ఆతిథ్యం ఇస్తుంటారు. గోదావరి జిల్లాల్లో వందలాది వంటకాలు వడ్డించినట్టు వార్తలు చూస్తుంటాం. ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో కూడా అలాంటి సంస్కృతికి నాంది పలుకుతున్నారు. తాము కూడా ఏ మాత్రం తగ్గేదేలే అన్నట్టుగా అతిథి మర్యాదలు చేస్తున్నారు. వి.మాడుగుల మండలం వీరవిల్లి అగ్రహారం గ్రామంలో సంక్రాంతి పండగకు వచ్చిన కొత్త అల్లుడికి అత్తింటి వారు 100 రకాల వంటలు వడ్డించారు. పల్లెల వెంకట సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె ఉమాదేవికి గత నెల డిసెంబరులో విజయనగరం జిల్లా రాజాంకు చెందిన చిరంజీవికి వివాహమైంది. సంక్రాంతికి రాజాం నుంచి వీరవిల్లి అగ్రహారం వచ్చిన చిరంజీవి కోసం సత్యనారాయణ దంపతులు వంద రకాల వంటకాలు తయారుచేయించారు. నూతన దంపతులకు ఆ పదార్థాలను పెద్ద అరటి ఆకులో వడ్డించారు. ఇందులో పిండి వంటలు, మటన్, చికెన్, చేపలు, రొయ్యలతో తయారుచేయించిన వివిధ రకాలు వంటకాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో కొత్త అల్లుడికి వంద రకాల వంటకాలు వడ్డించడం ఇదే తొలిసారి అని పలువురు చర్చించుకుంటున్నారు.

టీడీపీ నేత చొరవతో డ్రైనేజీ సమస్య పరిష్కారం


కార్మికులకు సూచనలిస్తున్న కనకరాజు

రామ్‌నగర్. జనవరి 15 (ఆంధ్ర జ్యోతి) : మ్యాన్‌హోల్స్ నిండిపోయి మురుగు బయటకు పొంగడంతో తీవ్ర దుర్గంధం నెలకొనగా, స్థానికులు ఫిర్యాదు చేయడంతో టీడీపీ స్థానిక నేతలు స్పందించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 28వ వార్డులోని పితానిదిబ్బ ప్రాంతంలో మ్యాన్‌హోల్ లీకై మురుగు బయటకు వెదజల్లింది. పారిశుధ్య కార్మికులెవరూ రాకపోవడతో కొందరు స్థానికులు.. టీడీపీ నేత నక్కా కనకరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి యూజీడీ కార్మికులను తీసుకొచ్చి సమస్య పరిష్కారమయ్యేలా చేశారు. దీంతో ఆయనకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు

వెంకోజీపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసి ఉన్న ధర్మశాస్త్ర అయ్యప్పస్వామికి సంబంధించిన ఆభరణాలను బుధవారం ఊరేగించారు. మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా అయ్యప్ప స్వామి ఆభరణాలను మంగళవాయిద్యాల నడుమ, వేద మంత్రాలతో పురవీధులలో ఊరేగించి, అనంతరం పదునెట్టాంబడి ఎక్కించి, స్వామివారికి అలంకరించి, హారతిచ్చి జ్యోతి దర్శనాన్ని కల్పించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాశశర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, బాలభాస్కర శర్మలు అయ్యప్పకు ప్రత్యేక అబిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

వేడుకగా సంక్రాంతి

- వేపగుంట- గోశాల రోడ్డుకు రంగవల్లుల శోభ
- తీరంలో పతంగుల కోలాహలం
- ఆర్‌కే బీచ్‌కు పోటెత్తిన సందర్శకులు
- కనుమ సందర్భంగా మాంసం దుకాణాలకు రద్దీ


తీరంలో గాలిపటాలు ఎగురువేస్తున్న జనం

రామ్‌నగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల సంక్రాంతి పండగను నగర వాసులు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. పోటాపోటీగా భోగి మంటలతో సందడి ప్రారంభం కాగా, సంక్రాంతి రోజున వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు రంగులతో తీర్చిదిద్దిన రంగవల్లికలు అవనిపై రంగుల హద్దులద్దాయి. కనుమ సందర్భంగా ఆలయాలు, గో సంరక్షణ కేంద్రాల్లో పూజలు, గాలిపటాలను ఎగురవేసి కొత ఉత్సాహంతో గుర్తుండిపోయేలా పెద్దపండగ సందడి చేసింది. మాంసం దుకాణాల వద్ద బుధవారం జనం బారులుతీరి మరీ కొనుగోలు చేయడం పండగ విశిష్టతను గుర్తుచేసింది. వీటితో పాటు నగరానికి పతంగులు కొత్త కళను సంతరించేలా చేశాయి. తీరంలో గాలిపటాలను ఎగురవేసి యువత ఉత్సాహంగా పండగ జరుపుకున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన ఈ పండగ బుధవారం నాడూ కొనసాగింది. కుటుంబ సమేతంగా ఆర్‌కే బీచ్‌కు చేరుకున్న వారంతా సందడి చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా తీరంలో గాలిపటాలు ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు. సాయంత్రానికి తీరానికి చేరుకున్న వారి సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోవడంతో బీచ్‌రోడ్డు జనం, వాహనాలతో కిక్కిరిసిపోయింది. పోలీసుల సైతం ట్రాఫిక్‌ను నియంత్రించలేక చేతులెత్తేశారు. రాత్రి పదిగంటలు దాటినా సందడి తగ్గలేదు.


వేపగుంట- గోశాల రోడ్డుపై నిర్వహించిన ముగ్గులపోటీలో మహిళలు


ఆర్కే బీచ్‌లో ట్రాఫిక్ రద్దీ


ఆర్కే బీచ్ వద్ద వివిధ ఆకృతులతో గాలిపటాలు


ఆర్కే బీచ్ వద్ద గాలిపటాలను ఎగురవేస్తుండడంతో కిక్కిరిసిన జనం


కోళ్లతో క్యూలో నిల్చునివున్న జనం



సీతమ్మధార ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న మాంసం దుకాణం వద్ద రద్దీ

పారిశుధ్యం.. పరమ అధ్వానం

పండుగ నేపథ్యంలో అందుబాటులో లేని శానిటరీ కార్మికులు



చైతన్యనగర్, త్రిబుల్ ఎస్ బార్ వద పేరుకుపోయిన చెత్త

మద్దిలపాలెం, జనవరి15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ నేపథ్యంలో అధికశాతం మంది పారిశుధ్య కార్మికులు సెలవులు పెట్టడంతో మద్దిలపాలెంలోని పలు వీధులు చెత్తకుప్పలతో నిండిపోయాయి.వరుసగా నాలుగు రోజుల పాటు వీధుల్లోని డంపర్‌బిన్ల నుంచి తరలించకపోవడంలోఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయింది. డంపర్‌బిన్లునిండిపోవడంతో స్థానికులు చెత్తను బయట వేసేశారు. దీంతో ఆ చెత్తను కుక్కలు, కాకులు, పందులు వంటివి చెల్లాచెదురు చేయడంతో వీధులు అపరిశుభ్రంగా తయారయ్యాయి. దుర్వాసన వెలువడుతోంది. అలాగే కాలువల్లో పూడికలు తీయకపోవడంతో కూడా పెద్ద సమస్యగా తయారైంది. మురుగునీరు నిల్వ అయి దుర్గంధం వెలువడుతున్నది. ఈ సమస్య 22, 23 వార్డుల్లో అధికంగా ఉంది.

మద్దిలపాలెం త్రిబుల్‌ఎస్ బార్ డౌన్, దేవీ అపార్ట్‌మెంట్ ఎదురు, రామాలయం. ఆర్టీసీ డిపో ప్రహరీ వెనుక, చైతన్యనగర్‌లలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. చైతన్యనగర్‌లో రోడ్లపైనే చెత్తాచెదారం పేరుకుపోయింది. అక్కడే అండర్ డ్రైనేజీ లీకై మురుగు నీరు రోడ్డు మీద ప్రవహిస్తోంది. అలాగే శివాజీపాలెం, పిఠాపురం కాలనీ, మంగాపురం కాలనీ, పీతలవానిపాలెం, బలరాంనగర్, రేసపువానిపాలెం తదితర ప్రాంతాలు చెత్తకుప్పలతో నిండిపోయాయి. చెత్తసేకరణ వాహనాలు కూడా రాకపోవడంతో స్థానికులు తమ ఇళ్లలో చెత్తను ఆరు బయటే పడేస్తున్నారు. దీంతో దోమలు, ఈగలు ముసురుతున్నాయి. రోగాలు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి మద్దిలపాలెంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేలకొరిగిన వృక్షం

- జన సంచారం లేకపోవడంతో తప్పిన ప్రమాదం


రైతు బజార్ సమీపంలో నేలకొరిగిన వృక్షం

ఎంవీపీ కాలనీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : భారీ వృక్షం నేలకొరిగింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఎవరూ రహదారిపై లేకపోవడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. ఎంవీపీ రైతు బజారుకు వెళ్లే మార్గం నిత్యం రద్దీగానే ఉంటుంది. బుధవారం రైతు బజారుకు సెలవు కావడంతో దాదాపు రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. ఒకటీ, అరా వాహనాలు వెళ్తున్నాయి. ఆ సమయంలో రోడ్డు పక్కన ఉన్న వృక్షం ఆకస్మికంగా నేలకొరిగింది. పూర్తిగా రోడ్డుపైనే పడిపోయింది. ఎప్పటి నుంచో ఓ పక్కకు కొమ్మలు వాలి ఉన్నాయి. కొద్దికొద్దిగా మొదుబీటలు వారి, బుధవారం ఒక్కసారిగా నేలకొరిగింది. ఈ పడిపోయిన వృక్షం తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వివాహిత ఆత్మహత్య


భర్త ఇంటి ముందు గొయ్యి తవ్వి ఆందోళన చేస్తున్న మృతురాలు పార్వతి బంధువులు,


మృతురాలు పార్వతి (ఫైల్‌ఫొటో)

పెందుర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతికి భర్తే కారణమంటూబంధువులు అతడి ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన మండలంలోని చింతలగట్లలో బుధవారం జరిగింది. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని చింతగట్లకు చెందిన గనిశెట్టి కనకరాజుకు మారికవలసకు చెందిన పార్వతి (37)తో 13 ఏళ్ల కిందట వివాహమయింది.వీరికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. కనకరాజు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

అయితే పెళ్లైనప్పటి నుంచి భార్యపై అనుమానంతో వేధించేవాడు. పుట్టింటికి వెళ్లనిచ్చేవాడుకాదని బంధువులు చెబుతున్నారు. ఇటీవ ల పుట్టింటి బంధువుల వివాహానికి వెళ్లనీయలేదు. ఈనెల 11న డబ్బు గురించి దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన పార్వతి కారులోని కూలెంట్ వాటర్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. అపస్మారక స్థితిలో వున్న ఆమెను కనకరాజు కేజీహెచ్‌లో చేర్పించాడు. చికిత్స పొందుతూ పార్వతి బుధవారం మృతి చెందింది. పోస్టుమార్టం అనం తరం పార్వతి మృతదేహాన్ని చింతలగట్ల తీసుకువచ్చారు.

అయితే భర్త వేధింపులతోనే పార్వతి మృతిచెందిందని ఆమె బంధువులు కనకరాజు ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. పార్వతి మృతదేహాన్ని భర్త ఇంటి ఎదుట పూడ్చుతామని పెద్ద గొయ్యి తవ్వారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ రేగింది. పోలీసులు, స్థానికులు రంగంలోకి దిగి చట్టపరంగా న్యాయం చేస్తామని చెప్పడంతో శాంతించి మృతదేహానికి శ్మశానంలో అంతక్రియలు నిర్వహించారు, కనకరాజు తమ అదుపులో ఉన్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బీఎస్పీ నేత మాయావతి జన్మదిన వేడుకలు

వెంకోజీపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : బహుజన సమాజ పార్టీ అధినేత మాయావతి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఎంటీసీ కాలనీలోని ఎల్‌ఐసీ అపార్టుమెంటు వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెదపెంకి శివప్రసాద్, జిల్లా ఇంచార్జి బీమరశెట్టి విశ్వనాథం, డాక్టర్ ఎస్‌ఏడీ పాల్, టి.లక్ష్మి, నేతలు ఎస్‌ఏ నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

మద్దిలపాలెం, జనవరి15 (ఆంధ్రజ్యోతి) : కిర్లంపూడి లేఅవుట్ రోడ్డులో బుధవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.

ఓల్డ్ పోస్టాఫీస్ ప్రాంతానికి చెందిన ఎం.భార్గవ్ (19), డి.అశోక్ (21) ద్విచక్రవాహనంపై సాయంత్రం బీచ్‌రోడ్డుకు బయలుదేరారు. కిర్లంపూడి లేఅవుట్ రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనానికి ఢీకొన్నారు. దీంతో బైక్ నుంచి రోడ్డు మీదకు ఎగిరి పడిపోవడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మూటో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రుల్ని ఆస్పతికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘోషాస్పత్రిలో 48 గంటల్లో జనన ధ్రువీకరణ పత్రం జారీ

జగదాంబ కూడలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఘోషాస్పత్రిలో జనన ధ్రువీకరణ పత్రాల జారీ కోసం ప్రత్యేకంగా కౌంటర్ ప్రారంభించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఉషాప్రసాద్ వెల్లడించారు. ఆసుపత్రిలో పుట్టిన బిడ్డల జనన ధ్రువీకరణ పత్రాలను 48 గంటల్లో అందజేస్తామన్నారు. ప్రసవం కోసం చేరిన సమయంలో కేస్‌షీట్‌లో తప్పుగా వివరాలు నమోదు చేయడం వల్ల జనన ధ్రువీకరణ పత్రాల జారీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కౌంటర్లు ఏర్పాటు చేసి తప్పులు సరి చేసి పత్రాలు జారీ చేస్తున్నామన్నారు.

కవి సత్యనారాయణ ఆకస్మిక మరణం



సత్యనారాయణ (ఫైల్)

విశాఖపట్నం, జనవరి15 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, రచయిత, ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ ఉద్యోగి ఎంవీవీ సత్యనారాయణ బుధవారం గుండెపోటుతో అకాల మరణం చెందారు. నగరంలోని మద్రిపాలెం ప్రాంతంలో నివాసముంటున్న సత్యనారాయణ బాల, ప్రౌఢ, పరిశోధక సాహిత్యాలపై విశేష కృషి చేశారు. చందమామ కథలు, అదృష్టమంటే, ప్రపంచ పిల్లల కథలు, సౌరంగంలో పులి, కొండమీద గొర్రెల మంద వంటి కథా సంపుటిలను ప్రచురించి బాల సాహిత్యానికి కృషి చేశారు. రచయితగా పడగ నీడ, పారాహుషార్, ఎదురింటి శ్రీమతి వంటి నవలలను అందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎంవీవీ సత్యనారాయణ మృతికి ప్రముఖులు నివాళులర్పించారు.

ఆలయంలో గోపూజ



గోవులకు పూజ చేస్తున్న భక్తులు

మహారాణిపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కనుమ పండుగ సందర్భంగా బుధవారం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో గోపూజ నిర్వహించారు. ఈ పండుగ రోజున పశువులను పూజించడం సంప్రదాయం. ఈ నేపథ్యంలో మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయ అర్చకుడు బాలుస్వామి ఆధ్వర్యంలో భక్తులు గోశాలలో గో పూజ నిర్వహించారు. గోవులకు పసుపు, కుంకుమలు రాసి, పూల దండలు వేసి, పండ్లు, ఫలహారం నైవేద్యం అందించారు. అనంతరం ఆలయంలో పూజ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ప్రయాణికుల కోసం రౌర్కెలా, గుణుపూర్ మధ్య రాకపోకలు సాగించే రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు రౌర్కెలా, జగదల్‌పూర్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 31 వరకు తాత్కాలికంగా స్లీపర్ క్లాసు జత చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

'ప్రధానికి నిద్ర లేకుండా చేస్తాం'



దీక్షలో పాల్గొన్న పోర్టు కార్మికులు

అక్కయ్యపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఉద్యోగులకు సంక్రాంతి పండుగ లేకుండా చేసిన భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి నిద్ర లేకుండా చేస్తామని సీఐటీయూ పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. పోర్టు ఆసుపత్రిని ప్రైవేటీకరించవద్దని చేస్తున్న నిరసన దీక్షలు బుధవారానికి 107 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు ఆసుపత్రి టెండర్‌కు ఎవరొచ్చినా అడ్డుకుంటామని మరోసారి స్పష్టంచేశారు. పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ అనైతికమని, కార్మికుల కృషితోనే ఆసుపత్రి అభివృద్ధి చెందిందన్నారు. సుమారు 40 వేల మంది కార్మికులు, వారి కుటుంబికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటు వారికి అప్పగించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జె.సత్యనారాయణ, కేఎస్ కుమార్, నాయకుడు పాల్గొన్నారు.

ఆనందమేళోత్సవాలకు ఆహ్వానం

డాబాగార్డెన్స్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పటేల్ గ్రౌండ్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై హైదరాబాద్‌లోని నల్లకుంట కుసుమ హరనాథ నామ ప్రచార సంస్థ సంప్రదాయరీతిలో నిర్వహిస్తున్న 80వ ఆనంద మేళోత్సవాలకు విశాఖ నగరానికి చెందిన ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్‌ను ఆహ్వానించింది. కుసుమ హరనాథుల దివ్యానుగ్రహంతో 80వ ఆనందమేళోత్సవాలను ఈ నెల 18 నుంచి 20 వరకు సంకీర్తనలు ప్రవచనాలతో నిర్వహిస్తామన్నారు. మాతృశ్రీ కుసుమ కుమారీదేవి ప్రేమతత్వం అనే అంశంపై రాజశేఖరన్ ప్రసంగిస్తారు.

అప్పన్నకొండపై వైభవంగా గజేంద్ర మోక్షం

» కన్నుల పండువగా ఉత్సవం » వేలాదిగా భక్తజనం



ఏనుగు, మొసలి పోరాట సన్నివేశం

సింహాచలం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై బుధవారం గజేంద్ర మోక్షం ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3.45 గంటలకు వరాహలక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వరదరాజాలంకారంలో పల్లకీపై మెట్ల మార్గంలో కొండ దిగువకు తీసుకువచ్చారు. తొలిపావంచా వద్ద దేవస్థానం ఏఈఓలు ఆనందకుమార్, రమణమూర్తి అధికారికంగా హారతులివ్వగా అడివివరం, సింహాచలం, విజినిగిరిపాలెం, పెందుర్తి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి కర్పూర నీరాజనాలతో స్వాగతించారు. తొలిపావంచా నుంచి బయలుదేరిన స్వామివారు తన సోదరి, అడివివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి ఆలయానికి వెళ్లి పసుపు కుంకుమలిచ్చి తిరిగి పూదోటకు చేరుకున్నారు. అక్కడ శోభాయమానంగా తీర్చిదిద్దిన మండపంలో ఆసీనులయ్యారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అలంకారి కరి సీతారామాచార్యులు సారథ్యంలో ఉత్సవానికి అర్చకులు శ్రీకారం చుట్టారు. ఆస్థాన విద్వాంసులు నాదస్వర కచేరీ చేయగా, చతుర్వేద పండితులు వేదాలను పఠించారు. మహా భాగవతంలోని గజేంద్రమోక్షం ఘట్టాన్ని అధ్యాపకులు రాజేష్, స్థానాచార్యులు రాజగోపాల్ సంయుక్తంగా గజ, మకర సంవాదాన్ని పఠించగా అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పూదోటలోని కొలను ఒడ్డున మకరి, గజేంద్రుల ప్రతిమలను ఉంచి, ఆచారం ప్రకారం మకరాన్ని సంహరించి గజేంద్రుని రక్షించేందుకు గురుతుగా మూడుసార్లు పైనుంచి కిందికి తారాజువ్వలను వదిలారు. మొసలి సంహారం పూర్తి కావడంతో బాణసంచా కాల్చి ఆనందోత్సాహాలు ప్రకటించారు. తరువాత స్వామివారిని పుష్కరిణీ సత్రం ఆవరణలోని ఉద్యానవన మండపంలో కాసేపు ఉంచి సిబ్బంది భోజన విరామం తర్వాత ఇత్తడి గజవాహనంపై కొండ దిగువ మూడు ప్రధాన మాడవీధుల్లో తిరువీధి జరిపారు. ఉత్సవంలో భాగంగా దేవాలయ సిబ్బంది పలుమార్లు బాణసంచాను కాల్చగా మహిళలు వాకిళ్ల ముందు వివిధ ఆకృతుల్లో రంగవల్లులను శోభాయమానంగా తీర్చిదిద్ది స్వామివారికి భక్తితో స్వాగతం పలికారు. మరికొందరు సంప్రదాయ దుస్తుల్లో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. అనంతరం స్వామివారు మెట్ల మార్గంలో తిరిగి సింహగిరికి చేరుకోవడంతో రాత్రి ఆరాధన, పవళింపు సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పివి నరసింహం తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫుట్‌పాత్ వ్యాపారులపై ఫిర్యాదు



పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహారాణిపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేస్తున్న కొందరు, విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి కాంగ్రెస్ నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఆ పార్టీ నాయకులు కేవీ సూర్యనారాయణ, కస్తూరి వెంకటరావుల ఆధ్వర్యంలో నగర పోలీసు కమిషనర్ బాగ్చిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్ఞానాపురం 41వ వార్డులో బాలికల పాఠశాలల, కళాశాలలున్నాయి. విద్యాసంస్థల వెలుపల బస్సు స్టాప్‌లకు సమీపంలో బీహార్, ఒడిశా వాసులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినవారు వస్త్రాలు, ఇతర వ్యాపారాలు చేస్తున్నారు. విద్యాసంస్థలకు వచ్చే విద్యార్థినులను, స్థానికులను, అటుగా వచ్చిన వారిని ఈ వ్యాపారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన కమిషనర్ చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు అధ్యక్షుడు కనకరాజు, సబ్బవరపు శ్రీధర్, మల్లికార్జున, రాయల్ రవి తదితరులు పాల్గొన్నారు.

122 ట్రావెల్ బస్సుల యజమానులపై కేసులు



బస్సులు తనిఖీ చేస్తున్న అధికారులు

మురళీనగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సీజన్‌లో ప్రజలకు తప్పనిసరిగా మారిన ప్రయాణాల్ని సొమ్ము చేసుకుంటున్న కొన్ని ట్రావెల్ బస్సుల నిర్వాహకులపై విశాఖపట్నం రవాణా శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. జనవరి 10 నుంచి ఇప్పటి వరకు సిటీ పరిధి ట్రావెల్ బస్సులను తనిఖీ చేసి 122 బస్సుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు డీటీసీ ఆదినారాయణ తెలిపారు. రవాణా శాఖ విశాఖ కార్యాలయ అధికారులు సిటీలోని పలు ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పండుగ తిరుగు ప్రయాణాల్లోనూ ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు తమ పరిధి, అనుమతుల మేరకు నిబంధనలు పాటించాలని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని డీటీసీ సూచించారు.

క్రికెట్ బుకీతో సంబంధాలున్న హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

మహారాణిపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): విధుల్లో అవినీతికి పాల్పడిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌ను పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సస్పెండ్ చేశారు. నగర పోలీసు కమిషనరేట్ పరిధిలోని స్పెషల్ బ్రాంచ్‌లో పి గంగరాజు అనే హెడ్ కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతనికి క్రికెట్ బుకీలతో సంబంధాలు ఉన్నాయని కమిషనర్‌కు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ జరిపించినప్పుడు ఓ కేసులో నిందితుడిగా ఉన్న క్రికెట్ బుకీతో గంగరాజుకు రెండేళ్లుగా సంబంధాలు ఉన్నట్లు కాల్‌డేటా ఆధారంగా నిర్ధారణ అయ్యింది. దీనితో కమిషనర్ వెంటనే హెడ్ కానిస్టేబుల్ గంగరాజును విధుల నుంచి సస్పెండ్ చేశారు. పోలీసు శాఖలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని కమిషనర్ హెచ్చరించారు.

పండుగ పూట విషాదం

» ముగ్గురు మృతి » కారు ఢీకొని బాలిక » వాహనం పైనుంచి తుళ్లిపడి యువకుడు » అనుమానాస్పద స్థితిలో గృహిణి..

పండగకు వచ్చి అనంత లోకాలకు..

గాజువాక, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పండగ నేపథ్యంలో అందరూ ఆనందంగా గడుపుతుండగా ఆ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఐదేళ్ల చిన్నారిని కారు ఢీకొని మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.



మృతి చెందిన లార్ని

సుజాతనగర్ ప్రాంతానికి చెందిన బి.నవీన్‌కుమార్ విదేశాల్లో ఉండగా, ఆయన భార్య, కుమార్తె లార్ని (5) ఇక్కడే ఉంటున్నారు. సంక్రాంతి పండక్కి గాజువాకలో గల సెలెస్ట్ అపార్ట్‌మెంటులో ఉంటున్న తాతయ్య ఇంటికి లార్ని తల్లితో కలిసి వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో కొంతమంది పిల్లలతో కలిసి ఆడుతుండగా.. ఓ వ్యక్తి సెల్లార్ నుంచి కారును బయటకు తీస్తూ బలంగా ఆ బాలికను ఢీకొన్నాడు. లార్ని తలపై నుంచి కారు చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలిక మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. గాజువాక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం నుంచి తుళ్లిపడి యువకుడు..



మృతుడు చంద్రమౌళి

సీతంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఓ ద్విచక్ర వాహనం డివైడర్‌పైకి వెళ్లడంతో వెనుక కూర్చున్న వ్యక్తి తుళ్లి కిందపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. రామాటాకీస్ రోడ్డు ప్రాంతీయ కంటి ఆసుపత్రి వద్ద ఈ సంఘటన జరిగినట్టు ద్వారకా పోలీసులు తెలిపారు. తాటిచెట్లపాలెం సోనియాగాంధి నగర్‌కి చెందిన గులివిందుల శ్రీనివాసరావు తన స్నేహితుడు సిద్ధి చంద్రమౌళి (22)తో కలిసి ఈ నెల 13న రాత్రి రామాటాకీస్ రోడ్డుకి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా కంటి ఆసుపత్రి వద్ద రోడ్డుపై ఉంచిన పెద్ద డివైడర్‌పైకి ద్విచక్రవాహనం దూలిపోయింది. దీంతో వాహనం వెనుక కూర్చున్న చంద్రమౌళి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేశారు. చంద్రమౌళి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో గృహిణి మృతి

కంచరపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఒక గృహిణి మృతి చెందింది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రేటర్ విశాఖ 47వ వార్డు పరిధి మధుసూదన్ నగర్‌లో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మధుసూదన్ నగర్‌లో నివాసం ఉంటున్న వల్లూరి ప్రసన్న లక్ష్మి (30) నాలుగేళ్ల కిందట (2021) నక్క భరద్వాజ్‌ని ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. భరద్వాజ్ హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నాడు. ప్రసన్న లక్ష్మి రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేసేది. పండుగ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ప్రసన్న లక్ష్మి శివాజీపాలెంలో కన్నవారింటికి వెళ్లింది. ఇంటికి వచ్చిన ప్రసన్న లక్ష్మి చిన్నబోయి కనిపించడంతో తల్లిదండ్రులు ప్రశ్నించారు. తన భర్త వద్దకు వెళ్లి వస్తానని చెప్పి తల్లిదండ్రుల వద్ద తన కుమారుడిని వదిలి ఇంటికి వెళ్లిన ఆమె మంగళవారం రాత్రి సమయంలో ఇంట్లో పూజ చేసే దేవుడి బల్ల వద్ద కాలిపోయిన స్థితిలో విగతజీవిగా పడి ఉంది. అందిన సమాచారం మేరకు కంచరపాలెం పోలీసులతో పాటు ఫైర్ సేఫ్టీగా అధికారులు ఘటన స్థలానికి చేరుకుని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు కేసు దర్యాప్తు చేస్తున్న కంచరపాలెం సీఐ చంద్రశేఖర్ వెల్లడించారు.

క్రికెట్ చాంపియన్ పీఎంపాలెం సీసీ


ముగిసిన శేఖరరావు స్మారక ట్రోఫీ



విజేత జట్టు సభ్యులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం నిర్వహించిన డి.శేఖరరావు ట్రోఫీ క్రికెట్ టోర్నీలో పీఎం పాలెం సీసీ చాంపియన్‌గా నిలిచింది. ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఫైనల్స్‌లో పీఎం పాలెం సీసీ 54 పరుగుల తేడాతో ఏసీసీపై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన పీఎం పాలెం సీసీ నిర్ణీత 40 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 287 పరుగులు చేసింది. కె.కశ్యప్ ప్రకాష్ సెంచరీ (121) సాధించగా, పి.వి.రచిత్ (45), రక్షన్ (32) రాణించారు. ఏసీసీ బౌలర్లలో యు.శ్రీను మూడు, రవికుమార్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఏసీసీ 39.2 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. మణికంఠ (60), హమీద్ మహ్మద్ (61) అర్ధ సెంచరీలు చేయగా, హనీఫ్ (42) రాణించారు. పీఎం పాలెం సీసీ బౌలర్లలో రచిత్ నాలుగు, రంజిత్ మూడు వికెట్లు పడగొట్టారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి. సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వీడీసీఏ ప్రతినిధులు కె.పార్థసారథి, టి.మౌళి, పి.బోగేంద్రబాబు, సి.పురుషోత్తమరెడ్డి, డాక్టర్ ఎస్‌కేఈ అప్పారావు, మణికుమార్, ఎంఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల క్రికెట్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్స్‌కు ఆంధ్ర



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ రవని

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కొచ్చిన్‌లో జరుగుతున్న జాతీయ మహిళల అంధుల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 48 పరుగుల తేడాతో తెలంగాణపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 226 పరుగులు చేసింది. సుజాత (56), సారిక (53), రవని (56) అర్ధ సెంచరీలు సాధించగా, రమ్య 34 పరుగులతో రాణించింది. లక్ష్య ఛేదనలో తెలంగాణ నిర్ణీత 20 ఓవర్లలో రెండు వికెట్లు నష్టపోయి 178 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఆల్ రౌండర్ ప్రతిభ చూపిన ఆంధ్ర క్రికెటర్ రవని ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంది.

విహారంలో విషాదం

» రేవుపోలవరం వద్ద సముద్రంలో ఇద్దరు గల్లంతు » బాలుడి మృతి, జాడలేని యువకుడు

ఎస్.రాయవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం వద్ద బుధవారం సముద్ర తీరంలో ఇద్దరు గల్లంతయ్యారు. వారిలో ఒకరిని సమీపంలో ఉన్నవారు రక్షించి, ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడు. మరొకరి ఆచూకీ లభించలేదు. నక్కపల్లి సీఐ రామకృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరుకి చెందిన పలువురు కుటుంబాలతో రేవుపోలవరం వచ్చారు. తీరంలో సరదాగా గడుపుతుండగా అలల తాకిడికి మాట్లాడలేకపోయిన సాత్విక్ (10) మునిగిపోయాడు. గమనించిన కాకర్ల మణికంఠ (23).. సాత్విక్‌ను రక్షించడానికి వెళ్లాడు. అలల ఉధృతితో అతడూ గల్లంతయ్యాడు. తీరంలో ఉన్నవారు కేకలు వేయడంతో మత్స్యకారులు సాత్విక్‌ను బయటకు తెచ్చి నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. గల్లంతైన మణికంఠ కోసం మెరైన్ పోలీసులు గాలిస్తున్నారు. లోవకొత్తూరుకు చెందిన రాము, సరోజిని దంపతుల కుమారుడు సాత్విక్ నాలుగో తరగతి చదువుతున్నాడు. మణికంఠ పత్తిపాడు మండలం సింహాద్రిపురానికి చెందిన రాము, పార్వతి దంపతుల కుమారుడు. దీంతో విహారయాత్ర విషాదంగా మారింది.

రహదారులు నిర్మానుష్యం



నిర్మానుష్యంగా ఉన్న అక్కయ్యపాలెం ప్రధాన రహదారి

అక్కయ్యపాలెం/సీతమ్మధార/డాబాగార్డెన్స్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనాల రణగొణధ్వనులతో రద్దీగా కనిపించే నగరంలోని రహదారులు బోసిపోయాయి. బతుకుతెరువు కోసం నగరానికి వచ్చి స్థిరపడిన వారు, వలస కూలీలు, ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు స్వగ్రామాలకు తరలి వెళ్లడంతో ఇక్కడి రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. మంగళ, బుధవారాల్లో డాబాగార్డెన్స్ జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్, సీఎం ఆర్ ప్రాంతాల్లో ప్రజల రాకపోకలు పలుచగా కనిపించాయి. నిత్యం రద్దీగా ఉండే డాబాగార్డెన్స్ నెల్లూరు మెస్ జంక్షన్ పూర్తిగా ఖాళీ అయ్యాయి. సెంటర్‌పాయింట్ రోడ్డు, కాంప్లెక్స్, జైల్‌రోడ్డు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, దొండపర్తి ప్రాంతాల రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహ కూడలితో పాటు నక్కవానిపాలెం జయభేరి 60 అడుగుల రోడ్డులో వాహనాల రాకపోకలు లేక నిశ్శబ్దం రాజ్యమేలింది. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునేంత వరకు రద్దీగా ఉండే ఈ రహదారి బోసిపోయింది. సొంతూళ్లు వెళ్లినవారు గురువారం సాయంత్రం నుంచి మెల్లగా వెనక్కి రావడం ప్రారంభమైనా, శని, ఆదివారాల్లో ఊపందుకుని, సోమవారం నుంచి రద్దీగా మారుతుందని అంచనా వేస్తున్నారు.

బోసిపోయిన నగరం

...5వ పేజీ తరువాయి

సంతోషం వ్యక్తంచేశారు. బుధవారం సుమారు 50 నుంచి 60 టన్నుల మాంసం విక్రయమైంది. ఇంతకు ముందు కిలో మాంసం రూ.900-940 ఉండేది. బుధవారం వేయి రూపాయలు చేసేశారు. దాంతో రూ.5 కోట్ల వ్యాపారం జరిగింది. అలాగే ఆదివారం నగరంలో దాదాపు ఐదు లక్షల కోళ్లను విక్రయిస్తుంటారు. కానీ బుధవారం చికెన్‌కు పెద్దగా డిమాండ్ కనిపించలేదు. దాంతో రెండు లక్షల కోళ్లు మాత్రమే విక్రయించగలిగామని వ్యాపారులు తెలిపారు. కిలో సగటున రూ.250 చొప్పున అమ్మామని, పెద్దగా లాభం లేదని పేర్కొన్నారు.

కనిపించని మందుబాబుల సందడి

సంక్రాంతి పండుగకు నగరంలో మందుబాబుల సందడి పెద్దగా కనిపించలేదు. అత్యధికులు స్వస్థలాలకు వెళ్లిపోవడంతో మద్యం దుకాణాలకు గిరాకీ పడిపోయింది. ఆదివారాల్లోనూ బేరం లేకుండా పోయిందని పలువురు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు కలిపి రూ.20 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరిగి ఉంటాయని ఓ అధికారి తెలిపారు.

అక్రమాలకు మహా ఊతం

... 5వ పేజీ తరువాయి

ఏసీపీకి, ఫార్వాడ్ చేశారు. దరఖాస్తును పరిశీలించిన ఏసీపీ కొన్ని రిమార్కులు రాసి అదే నెల 23న డీసీపీకి ఫార్వాడ్ చేశారు. డీసీపీ కూడా అదేరోజున దరఖాస్తుపై కొన్ని రిమార్కులు రాసి తన లాగిన్ నుంచి సిటీ ప్లానర్ (సీపీ)కి ఫార్వాడ్ చేశారు. సీపీ లాగిన్‌కు వెళ్లేసరికి వార్డు ప్లానింగ్ సెక్రటరీ షార్ట్ ఫాల్‌లో రాసిన రిమార్కులను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఆస్తి పన్ను చెల్లించినట్టు తాజా రసీదు, ప్లాన్‌లో ఎన్ని ఫ్లోర్‌లు కడుతున్నారు, భవనం ఎలివేషన్ డిజైన్ మాత్రమే లేదని, కోర్టులో పెండింగ్‌లో ఉన్న రెండు కేసులను పరిష్కరించుకుని దరఖాస్తును రీ సబ్మిట్ చేయాలంటూ అదేనెల 25న షార్ట్‌ఫాల్ చూపించారు. అయితే వార్డు ప్లానింగ్ సెక్రటరీ షార్ట్‌ఫాల్‌లో చూపించిన రిమార్కులు సిటీ ప్లానర్ లాగిన్‌కు వచ్చేసరికి కనిపించకపోవడం, ఏదో షార్ట్ ఫాల్‌లో పెట్టామని చెప్పుకోవడానికి అన్నట్టు మొక్కుబడిగా సులభంగా పరిష్కరించుకోగలిగే రిమార్కులు మాత్రమే కనిపించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అత్యంత కీలకమైన ఆ స్థలం లేఅవుట్‌లో రిజర్వు స్పేస్ కింద చూపించారని, ఆ స్థలానికి సంబంధించినది కాకుండా వేరొక స్థలానికి ఆస్తిపన్ను రశీదు చూపించారనే రిమార్కులను వేర్వేరు స్థాయిల్లో అధికారులు తొక్కిపెట్టి, సిటీ ప్లానర్ వద్దకు వెళ్లేసరికి కేవలం చిన్నపాటి రిమార్కులు రాసి దరఖాస్తును తిరిగి సమర్పించాలని షార్ట్ ఫాల్‌లో రాయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా కిందిస్థాయి అధికారి లేవనెత్తిన అభ్యంతరాలకు దరఖాస్తుదారుడు రీ సబ్మిట్ చేసినప్పుడు మాత్రమే తగిన పత్రాలతో నివృత్తి చేయడానికి అవకాశం ఉంటుంది. దరఖాస్తును పరిశీలించిన అధికారి ఆయాపత్రాలు సరైనవేనని, ప్రతిపాదిత స్థలానికి సంబంధించినవేనని, ఆ స్థలంపై ఎలాంటి వివాదాలు లేవని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే తన లాగిన్‌లో తాను సంతృప్తిచెందినట్టు రిమార్కు రాసి ఆమోదానికి తన పైఅధికారికి ఫార్వడ్ చేయాల్సి ఉంటుంది. కానీ ఈ స్థలం విషయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఒక్కో స్థాయిలో ఒక్కోలా రిమార్కులు రాయడం, దరఖాస్తుదారుడుకు మేలు చేసేలా వ్యవహరించారంటూ ప్రచారం జరుగుతోంది. దీనిపై చీఫ్ సిటీ ప్లానర్, జీవీఎంసీ కమిషనర్ లోతుగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

స్కూల్ కాంప్లెక్స్‌లు పునర్వ్యవస్థీకరణ

... 5వ పేజీ తరువాయి

పరిధిలో 40 నుంచి 50 మంది ఉపాధ్యాయులు, 800 నుంచి 1,000 మంది విద్యార్థులు ఉండేలా చూసుకోవాలి. ఇంకా ఒక పంచాయతీ పరిధిలో ఉన్న పాఠశాలలన్నింటినీ ఒక స్కూల్ కాంప్లెక్స్ కిందకు తీసుకురావాలి తప్ప రెండుగా విభజించకూడదని పాఠశాల విద్యా శాఖ స్పష్టంచేసింది. గతంలో యూపీ పాఠశాలలను స్కూల్ కాంప్లెక్స్ కేంద్రాలుగా గుర్తించగా ఇప్పుడు వాటిని రద్దు చేశారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు పలు బాధ్యతలు అప్పగించనున్నారు. తన పరిధిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల పర్యవేక్షణను ఆయనే చూడాలి. టీచర్ల పనితీరు, జీతాలు డ్రా చేయడం, సెలవులు మంజూరుచేయడం, ఇతర పాలనాపరమైన బాధ్యతలు చూడాల్సింది కూడా కాంప్లెక్స్ హెచ్‌ఎంలే. తన పాఠశాలతోపాటు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణ చూడాలి. అయితే...జిల్లాలో కాంప్లెక్స్‌లుగా గుర్తించిన పలు ఉన్నత పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది లేరు. అటువంటప్పుడు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సుమారు 40 నుంచి 50 మంది టీచర్ల బిల్లులు, ఇతర అంశాలు, పరీక్షల నిర్వహణకు సంబంధించి వ్యవహారాలు చూసుకోవడం హెచ్‌ఎం ఒక్కరి వల్ల కాదని సీనియర్ హెచ్‌ఎం ఒకరు వ్యాఖ్యానించారు. స్కూల్ కాంప్లెక్స్‌లలో ఉన్న సీఆర్పీలకు సమగ్రశిక్షా అభియాన్ అనేక పనులు అప్పగిస్తోంది. మండల విద్యా శాఖ కార్యాలయంలో పనులను ఉపాధ్యాయులే చేస్తున్నట్టు భవిష్యత్తులో స్కూలు కాంప్లెక్స్‌లో గుమస్తా పనులను టీచర్లకు అప్పగించే అవకాశం ఉందని మరో టీచరు అభిప్రాయపడ్డారు. పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఏ విధానం అమలుచేసినా ఇబ్బందిలేదని, అందుకు తగిన విధంగా వ్యవస్థను ఏర్పాటుచేయాలని కోరారు. ఇప్పటివరకూ తూతూమంత్రంగా ఉన్న స్కూల్ కాంప్లెక్స్‌లను బలోపేతం చేయాలన్న ఆలోచనకు అనుగుణంగా అన్ని వనరులు సమకూర్చాలని సూచించారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత

... 5వ పేజీ తరువాయి

మారుమూల ప్రాంతాల్లో ఉన్న లేఅవుట్‌ల వద్దకు ఇసుక సరఫరా చేసేందుకు లారీ యజమానులు ముందుకురావడం లేదు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న లేఅవుట్‌లకు మాత్రమే సరఫరా చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఒక రీచ్ మూసివేత, రాజమండ్రి నుంచి పూర్తిగా ఇసుక అందకపోవడం, రవాణా చార్జీలు తగ్గడం వంటి అంశాల ప్రభావంతో జిల్లాలో ఇళ్ల నిర్మాణాలకు తగినంత ఇసుక రాకపోవడంతో పనుల జోరు తగ్గింది. దీంతో గృహ నిర్మాణ సంస్థ అధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.


వెలవెలబోతున్న పాత గాజువాక ప్రధాన రహదారి


నిర్మానుష్యంగా ఉన్న షీలానగర్ రోడ్డు

బోసిపోయిన రహదారులు

- సంక్రాంతికి సొంతూళ్లకు తరలిన ప్రజలు
- దుకాణాల మూసివేతతో బంద్ వాతావరణం

గాజువాక/అగనంపూడి/అక్కిరెడ్డిపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే నగరంలోని పలు ప్రాంతాలు సంక్రాంతి పండగ నేపథ్యంలో బోసిపోయాయి. నగరంలో అత్యధికులు ఇతర ప్రాంతాల నుంచి ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వచ్చినవారే కావడంతో వారంతా పెద్ద పండక్కి తమ సొంతూళ్లకు, బంధువుల ఇళ్లకు కుటుంబాలతో సహా వెళ్లడంతో రహదారులన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. సోమ, మంగళవారాల్లో ప్రధాన కూడళ్లలో జన సంచారం అంతంత మాత్రంగానే కనిపించింది. ఎప్పుడూ ఆటోలు, కార్లు, భారీ వెహికల్స్, ద్విచక్ర వాహనాలతో రద్దీగా కనిపించే ముఖ్యమైన జంక్షన్లు సైతం నిర్మానుష్యంగా మారాయి. పాత గాజువాక, కొత్త గాజువాక, అగనంపూడి కూడలి, శనివాడ వేపచెట్టు జంక్షన్, మినీ జగదాంబ జంక్షన్, కూర్మన్నపాలెం,వడ్లపూడి, శ్రీనగర్, బీహెచ్‌పీవీ, ఆటోనగర్, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, షీలానగర్.. ఇలా అన్ని ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు వెలవెలబోయాయి. అలాగే జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న షీలానగర్, బీహెచ్‌పీవీ ప్రధాన కూడళ్లు జనకళ లేక బోసిపోయాయి. ఈ కారణంగా పలు పలు ట్రాఫిక్ సిగ్నల్ జంక్షన్‌ల వద్ద లైట్లను డైరెక్ట్ చేసేశారు. పారిశ్రామిక ప్రాంతంలో ఆర్టీసీ బస్సులు కూడా చాలా తక్కువగా తిరిగాయి. ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలైతే రెండు రోజుల పాటు బంద్ పాటించారా అన్నట్టుగా పరిస్థితి ఉంది. అయితే సినిమా హాళ్ల వద్ద మాత్రం ఆ సమయానికి జనం రద్దీగా కనిపించింది. సంక్రాంతి పండగంతా సినిమా హాళ్ల వద్దే కనిపించింది. పెద్దపెద్ద హోటళ్లన్నీ మూసివేయగా, ఫుట్‌పాత్‌పై ఉన్న చిన్న చిన్న దుకాణాను కొద్దిమంది తెరిచి టిఫిన్లు, తినుబండారాలను విక్రయించారు.


జనం లేక ఖాళీగా ఉన్న అగనంపూడి కూడలి

జీతాల కోసం ఉక్కు ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన

కూర్మన్నపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు జీతాలు చెల్లించే విషయంలో ఉక్కు యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ప్లాంట్ నాయకులు మంగళవారం కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా యూని యన్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ పండగ రోజుల్లో సైతం ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులను ఉక్కు యాజమాన్యం పస్తులు ఉంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన నెలలో రూ.రెండు వేల కోట్ల వ్యాపారం జరిగినప్పటికీ కార్మికులకు జీతాలు చెల్లించేందుకు యాజమాన్యం ముందుకు రాకపోవడం దారుణమన్నారు. వీఆర్ఎస్ పేరుతో ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. కార్మిక వర్గంపై కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర పాలకులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఉక్కు ఉద్యోగుల జీతాల విషయంలో పాలకులు కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కేఎం శ్రీనివాస్, యు.రామస్వామి, వైటీ దాసు, మహేశ్, ప్రసాద్, మరిడయ్య, తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న సీఐటీయూ ప్లాంట్ నాయకులు, కార్మికులు

ఉత్సాహభరితంగా ముగ్గుల పోటీలు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా 30 ఏళ్లుగా తుంగ్లాంలో ఏటా కనుమ రోజు నిర్వహించే కాకి కుంచారావు స్మారక ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. రాఘవస్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన ముగ్గుల పోటీలను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ప్రారంభించగా, సుమారు 180 మంది మహిళలు, యువతులు, బాలికలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏడేళ్ల ఏళ్ల బాలిక నుంచి 70 ఏళ్ల వృద్ధురాలు కూడా రంగుల ముగ్గులు వేయడం గమనార్హం. ఈ పోటీల విజేతలకు గురువారం జరగనున్న విజయ రాఘవస్వామి తీర్థం సందర్భంగా బహుమతులు అందజేస్తారు.


ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు

బెదిరించి సెల్ ఫోన్, నగదు అపహరణ

గాజువాక, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిని అడ్డగించి.. బెదిరించి సెల్ ఫోన్, నగదును అపహరించుకుపోయిన సంఘటన బుధవారం గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అక్కిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన యల్లపు సారథి మంగళవారం ఉదయం ములగాడ నుంచి అక్కిరెడ్డిపాలెం మార్గంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఆ సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆయన వాహనాన్ని అడ్డుకుని బెదిరించి ఫోన్, రూ.మూడు వందలను లాక్కోవడంతో పాటు సమీపంలోని కొండపైకి తీసుకెళ్లి గట్టిగా కొట్టారు. దీంతో సారథి గట్టిగా కేకలు వేయడంతో ఆ ఇద్దరు వ్యక్తులు అక్కడ నుంచి పారిపోయారు. సారథి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా సంక్రాంతి


తీరంలో గాలిపటాలు ఎగురవేస్తున్న జనం

- వేపగుంట- గోశాల రోడ్డుకు రంగవల్లుల శోభ
- తీరంలో పతంగుల కోలాహలం
- ఆర్‌కే బీచ్‌కు పోటెత్తిన సందర్శకులు
- కనుమ సందర్భంగా మాంసం దుకాణాలకు రద్దీ

రామ్‌నగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల సంక్రాంతి పండగను నగర వాసులు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. పోటాపోటీగా భోగి మంటలతో సందడి ప్రారంభం కాగా, సంక్రాంతి రోజున వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు రంగులతో తీర్చిదిద్దిన రంగవల్లికలు అవనిపై రంగుల హద్దులద్దాయి. కనుమ సందర్భంగా ఆలయాలు, గో సంరక్షణ కేంద్రాల్లో పూజలు, గాలిపటాలను ఎగురవేసి కొత ఉత్సాహంతో గుర్తుండిపోయేలా పెద్దపండగ సందడి చేసింది. మాంసం దుకాణాల వద్ద బుధవారం జనం బారులుతీరి మరీ కొనుగోలు చేయడం పండగ విశిష్టతను గుర్తుచేసింది. వీటితో పాటు నగరానికి పతంగులు కొత్త కళను సంతరించేలా చేశాయి. తీరంలో గాలిపటాలను ఎగురవేసి యువత ఉత్సాహంగా పండగ జరుపుకున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన ఈ పండగ బుధవారం నాడూ కొనసాగింది. కుటుంబ సమేతంగా ఆర్‌కే బీచ్‌కు చేరుకున్న వారంతా సందడి చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా తీరంలో గాలిపటాలు ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు. సాయంత్రానికి తీరానికి చేరుకున్న వారి సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోవడంతో బీచ్‌రోడ్డు జనం, వాహనాలతో కిక్కిరిసిపోయింది. పోలీసుల సైతం ట్రాఫిక్‌ను నియంత్రించలేక చేతులెత్తేశారు. రాత్రి పదిగంటలు దాటినా సందడి తగ్గలేదు.


వేపగుంట- గోశాల రోడ్డుపై నిర్వహించిన ముగ్గులపోటీలో మహిళలు


ఆర్కే బీచ్‌లో ట్రాఫిక్ రద్దీ


ఆర్కే బీచ్ వద్ద వివిధ ఆకృతులతో గాలిపటాలు


ఆర్కే బీచ్ వద్ద గాలిపటాలను ఎగురవేస్తుండడంతో కిక్కిరిసిన జనం


కోళ్లతో క్యూలో నిల్చునివున్న జనం



సీతమ్మధార ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న మాంసం దుకాణం వద్ద రద్దీ

85వ వార్డులో పరసల సందడి

అగనంపూడి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి దానబోయినపాలెం రామాలయం, జగన్నాథ స్వామి ఆలయం వద్ద మంగళవారం రాత్రి పరసలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు సీతా రాముల స్వామికి, జగన్నాథునికి పూజలు చేశారు. సాయంత్రం జరిగిన పరసల్లో జనం సందడి చేశారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా

అక్కిరెడ్డిపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): షీలానగర్-డాక్‌యార్డు రహదారిలో సోమవారం బోల్తా పడిన వాటర్ ట్యాంకర్‌ను గాజువాక పోలీసులు ఎక్స్‌కవేటర్‌తో మంగళవారం తొలగించారు. సోమ వారం సాయంత్రం నగరం నుంచి గాజువాక వైపు వెళుతున్న ఓ ప్రైవేటు వాటర్ ట్యాంకర్ షీలానగర్ టోల్‌గేటు సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన పొదల్లో బోల్తా పడగా, ఎవరికీ ఏమీ కాలేదు. మంగళవారం గాజువాక పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సహాయంతో ట్యాంకర్‌ను రోడ్డుపైకి తెచ్చారు.

సినిమా గైడ్

- **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 16, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 50, పచ్చిమిర్చి 52, కాకర కాయలు 46, బీరకాయలు 58, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 50, బంగాళదుంపలు 26, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది)48, మునక్కాడలు (కిలో) 110, బరబాటి 52, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీరదోస 40, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 44, కంద 76, దేముడుచిక్కుడు 76, గోరుచిక్కుడు 34, ఆగాకార దేశవాళి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూరపెండలం 46, బ్రకోలి 80, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 34, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

ప్రారంభమైన పరసల సందడి

గోపాలపట్నం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ అనంతరం పల్లెల్లో తీర్థమహోత్సవాలు (పరసలు) సందడి నెలకొంటుంది. నగర పరిధిలోని గ్రామాలతో పాటు రూరల్ ప్రాంతాల్లో గ్రామదేవతలు, ఇతర ఆలయాలకు మహోత్సవాలు నిర్వహించడం ఆచారం. కొత్తపాలెం, చంద్రనగర్, ఎల్లపువానిపాలెం, వెంకటాపురం, పద్మనాభనగర్, కంపరపాలెం, నరవ, కోటనరవ, సత్తివానిపాలెంలో తీర్థ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయాలను అలంకరించి పూజలు చేస్తారు. సాయంత్రం పండగ వాతావరణం నెలకొంటుంది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తాయి.

కాకి అప్పన్న పరస పోస్టర్ ఆవిష్కరణ

మల్కాపురం: స్థానిక కాకి అప్పన్న పరస (మరిడిమాంబ అమ్మవారు) పోస్టర్‌ను బుధవారం కాకి కుటుంబసభ్యులు ఆవిష్కరించారు. ఈనెల 22న జాతర నిర్వహిస్తారు. కాకి పోలిరెడ్డి, రమణరెడ్డి, కామేశ్‌రెడ్డి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.


చింతల అగ్రహారం శ్రీరామ పరసలో జన సందోహం

ఘనంగా ఏడు అమ్మవార్ల పరస

మల్కాపురం: ప్రకాశనగర్ ఏడుగుళ్ల జంక్షన్‌లో బుధవారం పీఎంసీ క్లబ్ ఆధ్వర్యంలో పరస జరిగింది ఏడు అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

పెందుర్తి: సంక్రాంతి ముగియడంతో పల్లెల్లో పరసల సందడి నెలకొంది. ఆలయాలు, అమ్మవారి పేరిట నిర్వహించే పరసలు ఉత్సాహాన్ని నింపుతాయి. మండలంలోని సుమారు 30 గ్రామాల్లో కనుమ రోజునే పరసల సందడి ప్రారంభమయింది.

వైభవంగా సరిపల్లి శివాలయ పరస

మండలంలోని సరిపల్లి శివాలయంలో బుధవారం తీర్థమహోత్సవం జరిగింది. భక్తులు పూజలు చేశారు.

చింతల అగ్రహారంలో...

పెందుర్తిరూరల్: మండలంలో పరసల సందడి మొదలైంది. కనుమ రోజు శ్రీరాముని పేరిట ప్రారంభమై శివరాత్రి వరకు కొనసాగుతాయి. చింతలఅగ్రహారంలో శ్రీరాముని పరస నిర్వహించారు. పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి పరసను తిలకించారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన

వేపగుంట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వేపగుంట నుంచి అప్పన్నపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో సీఎం రమేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన ముగ్గుల పోటీకి విశేష స్పందన లభించింది. 300 మంది మహిళలు రంగవల్లికలను అందంగా తీర్చిదిద్దారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ సనాతన సంప్రదాయాలు కాపాడుకోవాలన్నారు. మొదటి బహుమతిగా 55 ఇన్చీల ఎల్‌ఈడీ టీవీ, ద్వితీయ బహుమతిగా డబుల్‌డోర్ ఫ్రిడ్జ్, తృతీయ బహుమతిగా వాషింగ్ మిషన్‌ను విజేతలకు అందజేశారు. మరో 15 మందికి కన్సోలేషన్ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, సురేంద్ర మోహన్, నిర్వాహకుడు సి.నాగేంద్రబాబు, గొర్లె రాము, కార్పొరేటర్లు పీలా శ్రీనివాసరావు, బల్ల శ్రీనివాసరావు, రాపర్తికన్నా, ముమ్మన దేముడు, నేతలు రెడ్డి నారాయణరావు, పిన్నింటి పార్వతి, శోభారాణి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ముగ్గులు పరిశీలిస్తున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

కల్యాణ వెంకన్న ఆలయంలో కనుమ వేడుకలు

వేపగుంట జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శేషాద్రికొండపై కొలువైన కల్యాణ వెంకటేశ్వరాలయంలో బుధవారం కనుమ పండగను ఘనంగా నిర్వహించారు. గోశాలలో గోవులను ముస్తాము చేసి ప్రదక్షిణలు చేశారు. వాటికి పశుగ్రాసం, పండ్లు తినిపించారు. గోవులను ఆరాధించడం మన జీవన విధానంలో భాగమని అర్చకులు పేర్కొన్నారు. శ్రీహరి, దేముడు, ఆదినారాయణరావు, వర్మ, సుభాషిణి పాల్గొన్నారు.


వెంకన్న ఆలయంలో గో పూజ చేస్తున్న భక్తులు

వివాహిత ఆత్మహత్య

- భర్త వేధింపులే కారణమని బంధువుల ఆరోపణ
- మృతదేహాన్ని అతడి ఇంటి వద్ద ఖననం చేసేందుకు ఏర్పాట్లు
- పెందుర్తి మండలం చింతలగట్లలో ఘటన


కనకరాజు ఇంటి వద్ద గొయ్యి తవ్వి ఆందోళన చేస్తున్న దృశ్యం, పార్వతి (ఫైల్)

పెందుర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతికి భర్తే కారణమంటూ బంధువులు అతడి ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన మండలంలోని చింతలగట్లలో బుధవారం జరిగింది. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు చింతగట్లకు చెందిన గనిశెట్టి కనకరాజుకు మారికవలసకు చెందిన పార్వతి (37)తో 13 ఏళ్ల కిందట వివాహమయింది. వీరికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. కనకరాజు కారు డ్రైవర్. పెళ్లైనప్పటి నుంచి భార్యపై అనుమానంతో వేధించేవాడు. పుట్టింటికి వెళ్లనిచ్చేవాడు కాదని బంధువులు చెబుతున్నారు. ఈనెల 11న డబ్బు గురించి దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన పార్వతి కారులోని కూలెంట్ వాటర్ తాగింది. అపస్మారక స్థితిలో వున్న ఆమెను కనకరాజు కేజీహెచ్‌లో చేర్పించాడు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని చింతలగట్ల తీసుకువచ్చారు. భర్త వేధింపులతోనే పార్వతి మృతిచెందిందని ఆమె బంధువులు కనకరాజు ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. పార్వతి మృతదేహాన్ని భర్త ఇంటి ఎదుట పూడ్చుతామని గొయ్యి తవ్వారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ రేగింది. పోలీసులు, స్థానికులు రంగంలోకి దిగి న్యాయం చేస్తామని చెప్పడంతో శాంతించి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కనకరాజు తమ అదుపులో ఉన్నాడని, కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.


దంపతులకు వంద రకాల వంటకాలు వడ్డించిన దృశ్యం

కొత్త అల్లుడికి 100 రకాల వంటలతో భోజనం

మాడుగుల రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి అల్లుళ్లకు అత్తింటివారు ప్రత్యేక ఆతిథ్యం ఇస్తుంటారు. గోదావరి జిల్లాల్లో వందలాది వంటకాలు వడ్డించినట్టు వార్తలు చూస్తుంటాం. ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో కూడా అలాంటి సంస్కృతికి నాంది పలుకుతున్నారు. వి.మాడుగుల మండలం వీరవిల్లి అగ్రహారంలో సంక్రాంతి పండగకు వచ్చిన కొత్త అల్లుడికి అత్తింటివారు 100 రకాల వంటలు వడ్డించారు. పల్లెల వెంకట సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె ఉమాదేవికి గత డిసెంబరులో విజయనగరం జిల్లా రాజాంకు చెందిన చిరంజీవితో వివాహమైంది. సంక్రాంతికి వచ్చిన నూతన దంపతులకు వందరకాల ఆహారపదార్థాలను పెద్ద అరటి ఆకులో వడ్డించారు. ఈ ప్రాంతంలో ఇలా వంటకాలు వడ్డించడం ఇదే తొలిసారి అని పలువురు చర్చించుకుంటున్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

- 8 కోడి పుంజులు, రూ.5 వేలు పట్టివేత 9 మందిపై కేసు

పెందుర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోడి పందేల శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. సంక్రాంతి రోజున జుత్తాడ, పులగాలిపాలెంలో దాడి చేసి పందెం రాయుళ్ల నుంచి ఎనిమిది కోడి పుంజులు, రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నారు. పందేలు ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ అసిరి తాత, సిబ్బంది పాల్గొన్నారు.

మాంసం దుకాణాలకు రద్దీ

గోపాలపట్నం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కనుమ సందర్భంగా మాంసం దుకాణాలు బుధవారం కిటకిటలాడాయి. స్థానిక బంకు కూడలిలోని దుకాణాలు తెల్లవారుజాము నుంచీ రద్దీని సంతరించుకున్నాయి. సాధారణ రోజులతో పోలిస్తే రెండింత ఎక్కువగా వ్యాపారం జరిగినట్టు వర్తకులు తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

మల్కాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ, మాజీ ముఖ్యమంత్రి నందరమూరి తారకరామారావు వర్ధంతిని పురస్కరించుకొని ఎన్టీఆర్ మెమోరియల్ ఆధ్వర్యంలో సోమవారం విండ్‌బాల్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. పోటీలను మల్కాపురం సీఐ విద్యాసాగర్, టీడీపీ నేత కోరాడ శ్రీనివాసరావు ప్రారంభించారు. పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా రహదారులు

గోపాలపట్నం/ మల్కాపురం/ పెందుర్తి/ సింధియా/ వేపగుంట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ప్రజలు స్వగ్రామాలకు వెళ్లడంతో నగరం బోసిపోయింది. నిత్యం రద్దీగా ఉండే బంకు కూడలి కర్ఫ్యూను తలపించింది. సింహాచలం రైల్వేస్టేషన్ సంక్రాంతి రోజున వెలవెలబోయింది. పారిశ్రామిక ప్రాంతం బోసిపోయింది. పరిశ్రమలలో కార్మికుల సంఖ్య తగ్గింది. దుకాణాలు మూతపడ్డాయి. పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి నిర్మానుష్యంగా కనిపించింది. సింధియా న్యూకాలనీలో వారపు సంత ఖాళీగా దర్శనమిచ్చింది. ఎన్ఏడీ ఫ్లైఓవర్, ఎన్ఎస్‌టీఎల్ డబుల్ రోడ్డు, కరాస రహదారులు బోసిపోయాయి. వేపగుంట నాలుగురోడ్ల కూడలి నిర్మానుష్యంగా మారింది.